# రిజిస్ట్రీకరణ చట్టము, 1908.

(1908లోని 16వ చట్టము)

(18 డిసెంబరు, 1908)

దస్తావేజుల రిజిస్ట్రీకరణకు సంబంధించిన అధిశాసనములను ఏకీకరించుటకైన చట్టము.

దస్తావేజుల రిజిస్ట్రీకరణకు సంబంధించిన అధిశాసనములను ఏకీకరించుట ఉపయుక్తమైనందున ఇందుమూలముగా ఈ క్రింది విధముగా శాసనముచేయబడినది:-

## <u>భాగము 1.</u>

## <u>ప్రారంభిక.</u>

1. (1) ఈ చట్టమును రిజిస్ట్రీకరణ చట్టము, 1908 అని పేర్కొనవచ్చును. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము.

(2) ఇది జమ్మూ కాశ్మీరు రాజ్యము మినహా యావద్భారత దేశమునకు విస్తరించును:

అయితే రాజ్యప్రభుత్వము ఏవేని జిల్లాలను లేక దేశములోని ఏవేని భూభాగములను దీని అమలునుండి మినహాయించవచ్చును.

(3) ఇది 1909 జనవరి మొదటి దినమున అమలులోనికి వచ్చును.

2. ఈ చట్టములో, విషయగతమైన లేక సందర్భగతమైన వైరుధ్యమేదేని ఉన్ననే తప్ప,- నిర్వచనములు.

(1) "అభివర్ణన" అనగా, వర్ణించబడిన వ్యక్తియొక్క నివాస స్థలము, మరియు వృత్తి, వ్యాపారము, హోదా మరియు బిరుదు, (ఏదేని ఉన్నచో) మరియు భారతీయుని విషయములో అతని తండ్రి పేరు, లేక అతడు సాధారణముగా అతని తల్లి కుమారుడుగా వర్ణింపబడెడివాడైనచో, అతని తల్లి పేరు అని అర్థము;

(2) "పుస్తకము" అను పదపరిధియందు పుస్తకములోని ఒక భాగము మరియు ఒక పుస్తకముగా లేక ఒక పుస్తకములో భాగముగా రూపొందించు దృష్టితో కలిపిపెట్టబడిన ఎన్ని కాగితములైనను కూడా చేరియుండును;

(3) "జిల్లా" మరియు "ఉపజిల్లా" అనగా వరుసగా ఈ చట్టము క్రింద ఏర్పరచబడిన జిల్లా మరియు ఉపజిల్లా అని అర్థము:

(4) "జిల్లా న్యాయస్థానము" అను పదబంధపరిధియందు తన సాధారణ ఆరంభిక సివిలు అధికారితను వినియోగించుచున్న ఉన్నతన్యాయస్థానము చేరియుండును;

(5) "పృష్ఠాంకనము" మరియు "పృష్ఠాంకితము" అను పదపరిధియందు ఈ చట్టము క్రింద రిజిస్ట్రీ కొరకు సమర్పించబడిన ఏదేని దస్తావేజు యొక్క రైడరు లేక కవరింగు చీటిపై రిజిస్ట్రీకరణ అధికారి లిఖితపూర్వకముగా చేసిననమోదు చేరియుండును మరియు ఆ పదములు అట్టి నమోదుకు వర్తించును;

(6) "స్థిరాస్తి" అను పదపరిధియందు భూమి, భవనములు, వంశపారంపరిక బత్తెములు, మార్గములకు, వెలుతురుకు, రేవు (ఫెర్రీ)లకు, మత్స్య క్షేత్రములకు హక్కు, లేక భూమి నుండి లభించు ఏదేని ఇతర మేలు, మరియు భూబద్ధమైయున్న,

లేక భూబద్ధమైయున్న దానికి దేనికైనను శాశ్వతముగా బిగించబడియున్న వస్తువులు చేరియుండును; కాని కలపకై సిద్ధముగానున్న చెట్లుగాని పెరుగుచున్న పైర్లుగాని గడ్డిగాని ఇందుచేరియుండవు;

(6ఏ) "భారతదేశము" అనగా జమ్మూ-కాశ్మీరు రాజ్యము మినహా భారతదేశ రాజ్యక్షేత్రము అని అర్థము;

(7) "లీజు" అను పదపరిధియందు ఎదరు ప్రతి, కుభూలియతు సాగు చేయుటకు లేక ఆక్రమించుట కొరకగు వచనబంధము, మరియు లీజుకిచ్చుట కొరకగు కరారు చేరియుండును;

(8) "మైనరు" అనగా ఏ వ్యక్తికి తాను లోబడియున్న వైయక్తిక శాసనము ననుసరించి మెజారిటీ వయస్సు సంప్రాప్తము కాలేదో ఆ వ్యక్తి అని అర్థము;

(9) "చరాస్తి" అను పదపరిధియందు కలపకు సిద్ధముగానున్న చెట్లు, పెరుగుచున్న పైర్లు మరియు గడ్డి, చెట్లమీది పండ్లు మరియు చెట్లలోని రసము మరియు స్థిరాస్తి తప్ప ఇతర రకముల ప్రతియొక ఆస్తి చేరియుండును;

(10) "ప్రతినిధి" అను పదపరిధియందు మైనరు యొక్క సంరక్షకుడు మరియు ఉన్మాది లేక జడుని బాధ్యత అప్పగించబడిన వ్యక్తి లేక ఇతర శాసనిక రక్షకుడు చేరియుండును.

## భాగము 2.

## రిజిస్ట్రీకరణ సిబ్బందిని గురించి.

రిజిస్ట్రీకరణ ఇన్స్పెక్టర్ జనరలు.

3. (1) రాజ్యప్రభుత్వము, తన అధీనమునందున్న రాజ్యక్షేత్రముల కొరకు రిజిస్ట్రీకరణ ఇన్స్పెక్టర్ జనరలుగా ఒక అధికారిని నియమించవలెను:

అయితే, రాజ్యప్రభుత్వము, అట్టి నియామకము చేయుటకు బదులు, ఇన్స్పెక్టర్ జనరలుకు ఇందు ఇటు పిమ్మట ఒసగబడిన అధికారములను, అప్పగించబడిన కర్తవ్యములను అన్నింటిని గాని వాటిలో వేటినైననుగాని, రాజ్యప్రభుత్వము ఈ విషయమున నియమించునట్టి అధికారిగాని అధికారులుగాని అట్టి స్థానిక హద్దులలో వినియోగించవలెననియు నిర్వర్తించవలెననియు ఆదేశించవచ్చును.

(2) ఏ ఇన్స్పెక్టర్ జనరలు అయినను అదే సమయములో ప్రభుత్వము క్రింది ఏదేని ఇతర పదవియందు కూడ ఉండవచ్చును.

4. x x x x x x x x

జిల్లాలు మరియు ఉపజిల్లాలు.

5. (1) ఈ చట్ట ప్రయోజనముల కొరకు, రాజ్యప్రభుత్వము జిల్లాలను మరియు ఉపజిల్లాలను ఏర్పరచవలెను మరియు అట్టి జిల్లాల మరియు ఉపజిల్లాల హద్దులను విహితము చేయవచ్చును మరియు మార్చవచ్చును.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద ఏర్పరచబడిన జిల్లాలను మరియు ఉపజిల్లాలను వాటి హద్దులతోసహా, మరియు అట్టి హద్దులలో చేసిన ప్రతిమార్పును రాజపత్రములో అధిసూచించవలెను.

6. రాజ్యప్రభుత్వము పైనచెప్పబడినట్లు ఏర్పరచిన వేరువేరు జిల్లాలకు రిజిస్ట్రార్లుగా ఉండుటకు వేరువేరు ఉపజిల్లాలకు సబ్‌రిజిస్ట్రార్లుగా ఉండుటకు క్రమముగా, తాము సముచితమని భావించునట్టి వ్యక్తులను, వారు పబ్లికుఅధికారులు అయినను కాకున్నను సరే, నియమించవచ్చును. రిజిస్ట్రార్లు మరియు సబ్‌రిజిస్ట్రార్లు.

7. (1) రాజ్యప్రభుత్వము ప్రతి జిల్లాలోను రిజిస్ట్రారు కార్యాలయము అను పేరుతో ఒక కార్యాలయమును, ప్రతి ఉపజిల్లాలోను సబ్‌రిజిస్ట్రారు కార్యాలయము అను పేరుతో ఒక కార్యాలయమును లేక సంయుక్త సబ్‌రిజిస్ట్రార్ల కార్యాలయములు అను పేరుతో కార్యాలయములను స్థాపించవలెను. రిజిస్ట్రారు మరియు సబ్ రిజిస్ట్రారుల కార్యాలయములు.

(2) రాజ్యప్రభుత్వము ఏదేనిరిజిస్ట్రారు కార్యాలయములో అట్టి రిజిస్ట్రారుకు అధీనస్థమైన ఏదేని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయమును సంవిలీనము చేయవచ్చును మరియు అట్లు సంవిలీనము చేయబడిన కార్యాలయపు ఎవరేని సబ్‌రిజిస్ట్రారుకు, అతనికిగల అధికారములకును కర్తవ్యములకును అదనముగా అతడు ఎవరికి అధీనస్థుడై యున్నాడో ఆ రిజిస్ట్రారుకుగల అన్ని లేక ఏవేని అధికారములను కూడ వినియోగించుటకు కర్తవ్యములను కూడ నిర్వర్తించుటకు ప్రాధికారమీయవచ్చును:

అయితే, అట్లు ఈయబడిన ప్రాధికారమేదియు, ఈ చట్టము క్రింద సబ్ రిజిస్ట్రారుచే చేయబడిన ఉత్తరువుపై అపీలును తానే ఆకర్షించుటకు, అతనిని సమర్థుని చేయదు.

8. (1) రాజ్యప్రభుత్వము రిజిస్ట్రీకరణ కార్యాలయముల ఇన్‌స్పెక్టర్లు అనబడు అధికారులను కూడ నియమించవచ్చును, మరియు అట్టి అధికారుల కర్తవ్యములను విహితము చేయవచ్చును. రిజిస్ట్రీకరణ కార్యాలయముల ఇన్‌స్పెక్టర్లు.

(2) అట్టి ప్రతి ఇన్‌స్పెక్టరు, ఇన్‌స్పెక్టరు జనరలుకు అధీనస్థుడై యుండును.

9. x x x x x x x

10. (1) ఒక ప్రెసిడెన్సీ పట్టణము చేరియున్న జిల్లా యొక్క రిజిస్ట్రారు కానట్టి ఎవరేని ఇతర రిజిస్ట్రారు తన జిల్లాలో కర్తవ్య నిర్వహణలో ఉండుట కాకుండ అన్యథా గైరుహాజరైనపుడు, లేక అతని పదవి తాత్కాలికముగా ఖాళీగా ఉన్నపుడు, అట్టి గైరుహాజరు కాలావధిలోగాని రాజ్యప్రభుత్వము ఆ ఖాళీని పూరించు వరకుగాని, ఇన్‌స్పెక్టరు జనరల్ ఈ విషయమున నియమించునట్టి ఎవరేని వ్యక్తి, అట్టి నియామకము జరగనిచో, ఆ రిజిస్ట్రారు కార్యాలయము ఎవరి అధికారితలోని స్థానిక హద్దులలోనున్నదో ఆ జిల్లా న్యాయస్థానపు న్యాయాధీశుడు రిజిస్ట్రారుగా ఉండును. రిజిస్ట్రారు యొక్క గైరుహాజరు లేక అతని పదవిలో ఖాళీ.

(2) ఒక ప్రెసిడెన్సీ పట్టణము చేరియున్న జిల్లాయొక్క రిజిస్ట్రారు తన జిల్లాలో కర్తవ్య నిర్వహణలో ఉండుటకాకుండ అన్యథా గైరుహాజరైనపుడు లేక అతని పదవి తాత్కాలికముగా ఖాళీగా ఉన్నపుడు, అట్టి గైరుహాజరు కాలావధిలో గాని లేక రాజ్యప్రభుత్వము ఆ ఖాళీని పూరించు వరకుగాని ఇన్‌స్పెక్టరు జనరలు ఈ విషయమున నియమించునట్టి ఎవరేని వ్యక్తి రిజిస్ట్రారుగా ఉండును.

11. ఎవరేని రిజిస్ట్రారు తన జిల్లాలో కర్తవ్య నిర్వహణలో ఉండి కార్యాలయము నుండి గైరుహాజరైనపుడు, అతడు, అట్టి గైరుహాజరు కాలావధిలో 68వ మరియు 72వ పరిచ్ఛేదములలో పేర్కొనినవి తప్ప రిజిస్ట్రారు యొక్క మిగిలిన కర్తవ్యము లన్నింటిని నిర్వర్తించుటకు తన జిల్లాలోని ఎవరేని సబ్‌రిజిస్ట్రారును గాని ఇతర వ్యక్తినిగాని నియమించవచ్చును. రిజిస్ట్రారు, తన జిల్లాలో కర్తవ్య నిర్వహణలో ఉండి గైరుహాజరు అగుట.

సబ్‌రిజిస్ట్రారు యొక్క గైరుహాజరు లేక అతని పదవిలో ఖాళీ.

12. ఎవరేని సబ్‌రిజిస్ట్రారు గైరుహాజరైనపుడు లేక అతని పదవి తాత్కాలికముగా ఖాళీగా ఉన్నపుడు అట్టి గైరుహాజరు కాలావధిలో లేక ఆ ఖాళీ పూరింపబడు వరకు ఆ జిల్లా రిజిస్ట్రారు ఈ విషయమున నియమించునట్టి ఎవరేని వ్యక్తి సబ్‌రిజిస్ట్రారుగా ఉండును.

10వ 11వ మరియు 12వ పరిచ్ఛేదముల క్రింది నియామకములను గురించి రాజ్య ప్రభుత్వమునకు రిపోర్టు చేయుట.

13. (1) 10వ పరిచ్ఛేదము, 11వ పరిచ్ఛేదము లేక 12వ పరిచ్ఛేదము క్రింద చేయబడిన నియామకములన్నిటిని గురించి ఇన్‌స్పెక్టర్ జనరలు రాజ్యప్రభుత్వమునకు రిపోర్టు చేయవలెను.

(2) అట్టి రిపోర్టు రాజ్యప్రభుత్వము ఆదేశించునట్లు ప్రత్యేకమైనది గాని సాధారణమైనదిగాని అయిఉండవలెను.

(3) x x x x x x x

రిజిస్ట్రీ అధికారుల సిబ్బంది.

14. (1) x x x x x x x

(2) రాజ్యప్రభుత్వము ఈ చట్టము క్రింద వేరువేరు కార్యాలయములకు సముచిత సిబ్బందిని అనుమతించవచ్చును.

రిజిస్ట్రీ అధికారుల ముద్ర.

15. విభిన్న రిజిస్ట్రారుల్లు, సబ్‌రిజిస్ట్రారుల్లు ఆంగ్లములోను మరియు రాజ్య ప్రభుత్వము ఆదేశించునట్టి ఇతర భాషలోను ఈ క్రింది చెక్కడముగల ముద్ర ఉపయోగించవచ్చును.

"...... యొక్క రిజిస్ట్రారు (లేక సబ్‌రిజిస్ట్రారు) ముద్ర".

రిజిస్టరు పుస్తకములు మరియు అగ్నినిరోధకపు పెట్టెలు.

16. (1) రాజ్యప్రభుత్వము ఈ చట్ట ప్రయోజనముల కొరకు ప్రతియొక రిజిస్ట్రీ అధికారి కార్యాలయమునకు ఆవశ్యకమైన పుస్తకములను సమకూర్చవలెను.

(2) అట్లు సమకూర్చబడిన పుస్తకములలో, రాజ్యప్రభుత్వ మంజూరీతో, ఇన్‌స్పెక్టర్ జనరలు ఆయా సమయములందు విహితపరచిన ప్రరూపములు ఉండవలెను. అట్టి పుస్తకములలోని పుటల సంఖ్య వరుస క్రమములో అచ్చువేయబడియుండవలెను మరియు అట్టి పుస్తకములు ఎవరిచే జారీచేయబడినవో ఆ అధికారి అట్టి ప్రతియొక పుస్తకము ముఖపత్రముపై ఆ పుస్తకములోని పుటల సంఖ్యను ధ్రువపరచవలెను.

(3) రాజ్యప్రభుత్వము ప్రతియొక రిజిస్ట్రారు కార్యాలయమునకు ఒక అగ్ని నిరోధకపు పెట్టెను సరఫరా చేయవలెను మరియు ప్రతి జిల్లాలోను దస్తావేజుల రిజిస్ట్రీకరణకు సంబంధించిన రికార్డుల సురక్షితా అభిరక్షకొరకు తగిన ఏర్పాటు చేయవలెను.

## భాగము 3.

## రిజిస్ట్రీచేయవలసిన దస్తావేజులను గురించి.

తప్పనిసరిగా రిజిస్టరు చేయవలసిన దస్తావేజులు. 1866లోని 20వ చట్టము. 1871 లోని

17. (1) ఈ క్రింద తెలిపిన దస్తావేజులను, అవి ఏ ఆస్తికి సంబంధించినవో ఆ ఆస్తి 1864లోని 16వ చట్టము లేక భారత రిజిస్ట్రీకరణ చట్టము, 1866 లేక భారత రిజిస్ట్రీకరణ చట్టము, 1871 లేక భారత రిజిస్ట్రీకరణ చట్టము, 1877 లేక ఈ చట్టము అమలులోనికి వచ్చిన లేక వచ్చు జిల్లాలో ఉండి సదరు చట్టములు అమలులోనికి వచ్చిన లేక వచ్చు తేదీనగాని అటు పిమ్మటగాని అవి నిష్పాదించబడినవైనచో, రిజిస్టరు చేయవలెను; అవేవనగా:

(బీ) స్థిరాస్తికిగాని చరాస్తిలోగాని వంద రూపాయలు మరియు అంతకు మించిన విలువగలట్టి, నిహితమైనదైనను, సమాశ్రితమైనదైనను, ఏదేని హక్కును, హక్కుమూలమును లేక హితమును, అప్పుడేగాని భవిష్యత్తులోగాని, ఏర్పరచునట్లు, ప్రఖ్యానించునట్లు, హస్తాంతరణ చేయునట్లు, పరిమితపరచునట్లు లేక అంతరింపజేయునట్లు తాత్పర్యమగు లేక ప్రభావము కలిగియుండు, మరణశాసనము కానట్టి ఇతరమైన పత్రములు;

(సీ) అట్టి ఏదేని హక్కు, హక్కుమూలము లేక హితము ఏర్పరచబడిన, ప్రఖ్యానించబడిన, హస్తాంతరణ చేయబడిన పరిమితపరచబడిన లేక అంతరింపజేయబడిన బాబతున ఏదేని ప్రతిఫలము పొందినట్లు లేక చెల్లింపబడినట్లు అంగీకరించు మరణ శాసనము కానట్టి పత్రములు;

(డీ) స్థిరాస్తికి సంబంధించి వర్షానువర్ష లీజులు లేక ఒక సంవత్సరమునకు మించిన ఏదేని కాలావధి వరకు ఉండు లీజులు, లేక భాటకము (రెంటు)ను వార్షికముగా చెల్లించవలసిన లీజులు;

(ఈ) న్యాయస్థానపు డిక్రీని లేక ఉత్తరువును గాని ఏదేని అధినిర్ణయమును గాని అంతరణచేయు లేక హస్తాంతరణచేయు మరణశాసనము కానట్టి పత్రములు, - అట్టి డిక్రీ, లేక ఉత్తరువు లేక అధినిర్ణయము, స్థిరాస్తికిగాని స్థిరాస్తిలోగాని ఒక వంద రూపాయలు మరియు అంతకు మించిన విలువగలిగినట్టి నిహితమైనదైనను, సమాశ్రితమైనదైనను ఏదేని హక్కును, హక్కుమూలమును లేక హితమును అప్పుడే గాని, భవిష్యత్తులోగాని ఏర్పరచునట్లు, ప్రఖ్యానించునట్లు, హస్తాంతతరణచేయు నట్లు, పరిమితపరచునట్లు లేక అంతరింపజేయునట్లు తాత్పర్యమగునపుడు లేక ప్రభావము కలిగియుండునపుడు:

అయితే, రాజ్యప్రభుత్వము, రాజపత్రములో ప్రచురింపబడిన ఉత్తరువు ద్వారా ఏదేని జిల్లాలో లేక జిల్లాలోని భాగములో నిష్పాదించబడి తద్వారా అనుమతించ బడిన లీజు-కాలావధులు అయిదు సంవత్సరములకు మించకుండునట్టియు, చెల్లించ వలసిన వార్షిక భాటకములు (రెంట్లు) ఏబది రూపాయలకు మించకుండునట్టియు ఏవేని లీజులను ఈ ఉపపరిచ్ఛేదపు అమలు నుండి మినహాయించవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదము (1) యొక్క ఖండములు (బీ) మరియు (సీ) లోనిది ఏదియు ఈ క్రింది వాటికి వర్తించదు:-

(i) ఏదేని రాజీపత్రము, లేక

(ii) జాయింట్‌స్టా కంపెనీలోని వాటాలకు (షేర్లకు) సంబంధించిన ఏదేని పత్రము, - అట్టి కంపెనీ యొక్క సంపత్తి పూర్ణత: లేక భాగత: స్థిరాస్తితో కూడియున్నప్పటికిని; లేక

(iii) ఏదేని అట్టి కంపెనీచే జారీచేయబడి, స్థిరాస్తికిగాని స్థిరాస్తిలోగాని అది అట్టి కంపెనీ ఒక రిజిస్ట్రీకృత పత్రము ద్వారా తన యావద్ స్థిరాస్తినిగాని అందలి భాగమునుగాని అందలి ఏదేని హితమునుగాని అట్టి డిబెంచరుదారుల మేలుకొరకు ట్రస్టీలకు ట్రస్టుపై తాకట్టు పెట్టి, హస్తాంతరణచేసి, లేక ఇతర విధముగా అంతరణచేసి సమకూర్చిన ప్రతిభూతికి ఆ డిబెంచరుదారుకు హక్కు కలిగించునదైన మేరకు తప్ప,-ఏదేని హక్కును, హక్కుమూలమును, లేక హితమును ఏర్పరచని, ప్రఖ్యానించని హస్తాంతరణ చేయని, పరిమితపరచని లేక అంతరింపజేయని ఏదేని డిబెంచరు; లేక

(iv) ఏదేని అట్టి కంపెనీచే జారీచేయబడిన ఏదేని డిబెంచరుపై చేసిన పృష్ఠాంకనము లేక ఆ డిబెంచరు అంతరణ; లేక

(v) స్థిరాస్తికిగాని లేక స్థిరాస్తిలోగాని ఒక వంద రూపాయలు లేక అంతకుమించి విలువగలిగిన ఏదేని హక్కును, హక్కుమూలమును లేక హితమును అదే ఏర్పరచకుండ, ప్రఖ్యానించకుండ, హస్తాంతరణ చేయకుండ, పరిమితపరచకుండ లేక అంతరింపజేయకుండ, నిష్పాదించినపుడు ఏదేని అట్టి హక్కును, హక్కుమూలమును లేక హితమును ఏర్పరచునట్టి, ప్రఖ్యానించునట్టి, హస్తాంతరణచేయునట్టి, పరిమితపరచునట్టి లేక అంతరింపజేయునట్టి మరొక దస్తావేజును పొందు హక్కు మాత్రమే ఏర్పరచునట్టి ఏదేని దస్తావేజు; లేక

(vi) ఏ డిక్రీ లేక ఉత్తరువు రాజీపై చేయబడినట్లు అభివ్యక్తపరచబడి దావా లేక చర్యయొక్క విషయవస్తువు కాకుండ ఇతర స్థిరాస్తి అందు చేరియున్నదో ఆ డిక్రీ లేక ఉత్తరువు తప్ప, ఏదేని న్యాయ స్థానపు డిక్రీ లేక ఉత్తరువు; లేక

(vii) ప్రభుత్వముచే చేయబడిన స్థిరాస్తి యొక్క ఏదేని అనుదానము; లేక

(viii) రెవిన్యూ అధికారిచే చేయబడిన ఏదేని పంపకపు పత్రము; లేక

1871 లోని 26వ చట్టము. 1883 లోని 19వ చట్టము.

(ix) భూమి అభివృద్ధి చట్టము, 1871 లేక భూమి అభివృద్ధి అప్పుల చట్టము, 1883 క్రింద అప్పు మంజూరుచేయు ఏదేని ఉత్తరువు లేక ఈయబడిన అదనపు ప్రతిభూతి పత్రము; లేక

1884 లోని 12వ చట్టము.

(x) వ్యవసాయదారుల అప్పుల చట్టము, 1884 క్రింద అప్పు మంజూరు చేయు ఏదేని ఉత్తరువు లేక ఆ చట్టము క్రింద ఇవ్వబడిన అప్పును తిరిగి చెల్లించుటకు ప్రతిభూతి కల్పించు పత్రము; లేక

1890 లోని 6వ చట్టము.

(xఏ) ధర్మాదాయ చట్టము 1890, క్రింద ధర్మాదాయ కోశాధికారిలో ఏదేని ఆస్తిని నిహితముచేయుచు లేక ఎవరేని అట్టి కోశాధికారి నుండి ఏదేని ఆస్తిని నిర్నిహితము చేయుచు చేయబడిన ఏదేని ఉత్తరువు; లేక

(xi) తాకట్టు డబ్బు పూర్తిగాగాని అందలి ఏదేని భాగముగాని చెల్లించబడినట్లు ఒప్పుకొనుచు తాకట్టుపత్రముపై చేసిన పృష్ఠాంకనము మరియు తాకట్టు క్రింద బకాయిపడిన డబ్బు చెల్లింపబడినట్లు ఏదేని ఇతర రసీదు– ఆ రసీదు తాకట్టును అంతరింపజేసినట్లు తాత్పర్యము కానపుడు; లేక

(xii) సివిల్ లేక రెవిన్యూ అధికారి బహిరంగ వేలము ద్వారా విక్రయించిన ఏదేని ఆస్తి కొనుగోలుదారుకు ఇచ్చిన ఏదేని విక్రయ ధ్రువపత్రము.

విశదీకరణ:– స్థిరాస్తి యొక్క విక్రయము కొరకై కాంట్రాక్టు చేసికొనబడినట్లు తాత్పర్యమగు లేక ప్రభావముగల దస్తావేజులో ఏదేని బయానా లేక పూర్తిగా గాని అందులో కొంతగాని క్రయధనము చెల్లింపబడినట్లు తెలుపబడినదను సంగతి కారణమున మాత్రమే అట్టి దస్తావేజు రిజిస్టరు చేయబడవలసినదిగా లేక ఎప్పుడైనను రిజిస్టరు చేయబడవలసియుండినదిగా భావింపబడరాదు.

(3) పుత్రుని దత్తు తీసుకొనుటకు, 1872 జనవరి 1వ తేదీ తరువాత నిష్పాదించబడినవియు వీలునామా ద్వారా ఒసగబడినవియు ప్రాధికారపత్రములు కూడా రిజిస్టరు చేయబడవలెను.

అభిమతమును బట్టి రిజిస్టరు చేయుటకు వీలున్న దస్తావేజులు.

18. ఈ క్రింది దస్తావేజులలో దేనినైనను ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయవచ్చును; అవేవనగా:-

(ఏ) స్థిరాస్తికిగాని స్థిరాస్తిలోగాని వంద రూపాయలకు తక్కువ విలువ గలిగిన, నిహితమైనదైనను సమాశ్రితమైనదైనను ఏదేని హక్కును, హక్కుమూలమును లేక హితమును అప్పుడేగాని భవిష్యత్తులోగాని ఏర్పరచునట్లు, ప్రఖ్యానించునట్లు హస్తాంతరణ చేయునట్లు పరిమితపరచునట్లు లేక అంతరింపజేయునట్లు తాత్పర్యమగు లేక ప్రభావము కలిగియుండు (దానపత్రములు మరియు వీలునామాలుకానట్టి) పత్రములు;

(బీ) అట్టి ఏదేని హక్కు, హక్కుమూలము, లేక హితము ఏర్పరచబడిన, ప్రఖ్యానించబడిన, హస్తాంతరణ చేయబడిన, పరిమితపరచబడిన లేక అంతరింపజేయబడిన బాబతున ఏదేని ప్రతిఫలము ముట్టినట్లు లేక చెల్లింపబడినట్లు ఒప్పుకొను పత్రములు;

(సీ) స్థిరాస్తికి సంబంధించి ఒక సంవత్సరమునకు మించని ఏదేని కాలావధి వరకు ఉండు లీజులు మరియు 17వ పరిచ్ఛేదము క్రింద మినహాయించబడిన లీజులు;

(సీసీ) న్యాయస్థానపు ఏదేని డిక్రీని లేక ఉత్తరువునుగాని ఏదేని అధినిర్ణయమునుగాని అంతరణచేయు లేక హస్తాంతరణచేయు పత్రములు-అట్టి డిక్రీ, లేక ఉత్తరువు లేక అధినిర్ణయము స్థిరాస్తికిగాని స్థిరాస్తిలోగాని ఒక వంద రూపాయల కంటె తక్కువ విలువ గలిగిన, నిహితమైనదైనను సమాశ్రితమైనదైనను ఏదేని హక్కును, హక్కుమూలమును లేక హితమును అప్పుడేగాని భవిష్యత్తులోగాని ఏర్పరచునట్లు, ప్రఖ్యానించునట్లు, హస్తాంతరణ చేయునట్లు, పరిమితపరచునట్లు లేక అంతరింపజేయునట్లు తాత్పర్యమగునపుడు లేక ప్రభావము కలిగియుండునపుడు;

(డీ) స్థిరాస్తికిగాని స్థిరాస్తిలోగాని ఏదేని హక్కును, హక్కుమూలమును లేక హితమును ఏర్పరచునట్లు, ప్రఖ్యానించునట్లు, హస్తాంతరణ చేయునట్లు, పరిమిత పరచునట్లు లేక అంతరింపజేయునట్లు తాత్పర్యమగు, లేక ప్రభావము కలిగియుండు (వీలునామాలుకానట్టి) పత్రములు;

(ఈ) వీలునామాలు; మరియు

(యఫ్) 17వ పరిచ్ఛేదము ప్రకారము రిజిస్టరు చేయనక్కరలేని అన్ని ఇతర దస్తావేజులు.

రిజిస్ట్రీ అధికారికి అర్థముకాని భాషలోగల దస్తావేజులు.

19. రిజిస్ట్రీ కొరకు తగురీతిగా దాఖలు చేయబడిన ఏదేని దస్తావేజు, రిజిస్ట్రీ అధికారికి అర్థముకాని మరియు, ఆ జిల్లాలో మామూలుగా వాడబడనిభాషలోనున్నచో, ఆ జిల్లాలో సాధారణముగా వాడబడు భాషలో దాని సరియైన అనువాదమును, మరియు సరియైన నకలునొక దానిని దానికి జతపరచిననే తప్ప, ఆ దస్తావేజును రిజిస్టరు చేయుటకు, అతడు నిరాకరించవలెను.

హంసపాదులు, ఖాళీలు, తుడుపులు, లేక మార్పులు కలిగియున్న దస్తావేజులు.

20. (1) ఏదేని హంసపాదు, ఖాళీ, తుడుపు, లేక మార్పుగల ఏదేని దస్తావేజును నిష్పాదించు వ్యక్తులు తమ సంతకములతో, లేక పొడి సంతకముతో, అట్టి హంసపాదును, ఖాళీని, తుడుపును, లేక మార్పును అనుప్రామాణీకరించిననే తప్ప, అట్టి దస్తావేజును రిజిస్ట్రీకై స్వీకరించుటకు, రిజిస్ట్రీ అధికారి తన వివేచనాను సారము నిరాకరించవచ్చును.

(2) రిజిస్ట్రీ అధికారి ఏదేని అట్టి దస్తావేజును రిజిస్టరు చేయుచో అతడు దానిని రిజిస్టరు చేయునపుడు రిజిస్టరులో అట్టి హంసపాదు, ఖాళీ, తుడుపు, లేక మార్పులను గూర్చి అతడు టిప్పణి (నోటు) వ్రాయవలెను.

ఆస్తి వర్ణన మరియు మ్యాపులు లేక ప్లానులు.

21. (1) స్థిరాస్తికి సంబంధించిన మరణశాసనము కానట్టి దస్తావేజేదియు, అట్టి ఆస్తిని గుర్తుపట్టుటకు చాలినన్ని వివరములు అందు ఉన్ననే తప్ప, రిజిస్ట్రీ కొరకు స్వీకరింపబడరాదు.

(2) పట్టణములోని ఇండ్లను వాటికి ఎదురుగానున్న వీధి లేక రోడ్డుకు (దానిని నిర్దిష్టపరచవలెను) ఉత్తరమున లేక ఇతర దిక్కున ఉన్నవని మరియు వాటిలో అప్పుడున్న లేక పూర్వమున్న ఆక్రమణదారులను తెలిపి మరియు అట్టి వీధిలోని లేక రోడ్డులోని ఇండ్లకు నెంబర్లు ఇవ్వబడినచో అట్టి నెంబర్లను తెలుపుచు వివరించవలెను.

(3) ఇతరమైన ఇండ్లను మరియు భూములను వాటికి పేర్లు ఏమైనా ఉన్నచో అట్టి పేర్లను, మరియు అవి ఫలానా ప్రాదేశిక విభాగములో ఉన్నవనియు వాటిపైన ఉన్న వస్తువులను, వాటికి ఆనుకొనిఉన్న రోడ్లను మరియు ఇతర ఆస్తులను, వాటిలో అప్పుడున్న ఆక్రమణదారులను తెలుపుచును, ఆచరణ సాధ్యమైనపుడెల్లను ప్రభుత్వ మ్యాపుల లేక సర్వేల నిర్దేశముతోను వివరించవలెను.

(4) మరణశాసనముకానట్టి ఏదేని దస్తావేజులో చేరియున్న ఏదేని ఆస్తియొక్క మ్యాపు లేక ప్లాను ఆ దస్తావేజులో ఉన్నచో అట్టిదస్తావేజేదియు ఆ మ్యాపు లేక ప్లాను యొక్క సరియైన నకలు, లేక అట్టి ఆస్తి అనేక జిల్లాలలో ఉన్నచో, ఎన్ని జిల్లాలలో ఉన్నదో అన్ని మ్యాపుల లేక ప్లానుల సరియైన నకళ్లు దానికి జతపరచబడిననే తప్ప, రిజిస్ట్రీకొరకు స్వీకరించబడరాదు.

ఇండ్లను, భూమిని ప్రభుత్వ మ్యాపులు లేక సర్వేల నిర్దేశముతో వివరించుట.

22. (1) రాజ్యప్రభుత్వము అభిప్రాయములో పట్టణములలోని ఇండ్లు కానట్టి ఇండ్లను, భూములను ప్రభుత్వ మ్యాపు, లేక సర్వే నిర్దేశముతో వివరించుట ఆచరణసాధ్యమైనయెడల, రాజ్యప్రభుత్వము ఈ చట్టము క్రింద చేయబడిన నియమము ద్వారా పైన తెలిపినట్టి ఇండ్లను మరియు భూములను 21వ పరిచ్ఛేద ప్రయోజనముల కొరకు అట్లు వివరించవలెనని కోరవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద చేయబడిన ఏదేని నియమము ద్వారా వేరు విధముగా నిబంధింపబడిననే తప్ప ఏదేని దస్తావేజు, అది ఏ ఆస్తికి సంబంధించినదో ఆ ఆస్తిని గుర్తు పట్టుటకు చాలినన్ని వివరములు అందు ఉన్నచో, 21వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2) లేక ఉపపరిచ్ఛేదము (3) యొక్క నిబంధనలను పాటించనందు వలన, రిజిస్టరు చేయబడు హక్కును కోల్పోదు.

## భాగము 4.

## సమర్పించు సమయమును గురించి.

దస్తావేజు సమర్పించు సమయము.

23. 24వ, 25వ మరియు 26వ పరిచ్ఛేదములలోని నిబంధనలకులోబడి, వీలునామా కానట్టి దస్తావేజు ఏదియు, అది నిష్పాదింపబడిన తేదీ నుండి నాలుగు మాసముల లోపల సముచిత అధికారికి రిజిస్ట్రీ కొరకు సమర్పించబడిననే తప్ప, రిజిస్ట్రీకై స్వీకరించబడరాదు:

అయితే, డిక్రీ లేక ఉత్తరువు యొక్క నకలును ఆ డిక్రీ లేక ఉత్తరువు చేయబడిన తేదీ నుండి నాలుగు మాసముల లోపల లేక అది అపీలు చేయదగినది

అయినచో, అది అంతిమమైనదైన తేదీ నుండి నాలుగు మాసముల లోపల, సమర్పించవచ్చును.

కొన్ని దస్తావేజులను తిరిగి రిజిస్టరుచేయుట.

23-ఏ. ఈ చట్టములో తద్విరుద్ధముగా ఏమిఉన్నప్పటికినీ, ఏ సందర్భములోనైనను రిజిస్ట్రీ చేయవలసిన దస్తావేజును, సమర్పించుటకు తగిన అధికారములేని వ్యక్తి నుండి రిజిస్ట్రారుచేగాని సబ్‌రిజిస్ట్రారుచేగాని రిజిస్ట్రీ కొరకు స్వీకరించబడి రిజిస్టరు చేయబడినచో, అట్టి దస్తావేజు క్రింద క్లెయిముచేయు ఏ వ్యక్తియైనను అట్టి దస్తావేజు యొక్క రిజిస్ట్రీకరణ శాసనమాన్యతలేనిదని మొదటిసారిగా తెలుసుకొన్నప్పటినుండి నాలుగు మాసములలోపల భాగము 6లోని నిబంధనల ననుసరించి, ఆ దస్తావేజు మొదట రిజిస్టరు చేయబడియున్నట్టి జిల్లా రిజిస్ట్రారు కార్యాలయములో తిరిగి రిజిస్టరు చేయుటకు అట్టి దస్తావేజును సమర్పించవచ్చును లేక సమర్పింపజేయవచ్చును; రిజిస్ట్రారు ఆ దస్తావేజును సమర్పించుటకు తగిన అధికారములేని వ్యక్తి నుండి రిజిస్ట్రీకొరకు స్వీకరింపబడినదని తృప్తిచెందిన మీదట, అది పూర్వము రిజిస్టరు చేయబడకుండిన ఎట్లో అట్లే మరియు తిరిగి రిజిస్టరు చేయబడుటకు దాని సమర్పణను భాగము 4 క్రింద అనుమతించబడిన గడువులోపల రిజిస్ట్రీకొరకై సమర్పించియుండిన ఎట్లో అట్లే అట్టి దస్తావేజును తిరిగి రిజిస్టరు చేయుటకు చర్య తీసుకొనవలెను, మరియు దస్తావేజుల రిజిస్ట్రీకరణ గురించి ఈ చట్టములోగల నిబంధనలన్నియు అట్లు తిరిగి రిజిస్టరు చేయుటకు వర్తించును; మరియు అట్టి దస్తావేజు ఈ పరిచ్ఛేదపు నిబంధనల ప్రకారము తగురీతిగా తిరిగి రిజిస్టరు చేయబడినచో, అది సకల ప్రయోజనముల కొరకు దానిని మొదట రిజిస్టరు చేసిన తేదీనుండి తగురీతిగా రిజిస్టరు చేయబడినదిగా భావింపబడవలెను:

అయితే, ఈ పరిచ్ఛేదము వర్తించు దస్తావేజు క్రింద క్లెయిముచేయు ఏ వ్యక్తియైనను, ఆ దస్తావేజు యొక్క రిజిస్ట్రీకరణ శాసనమాన్యత లేనిదని మొదటి సారిగా తెలుసుకొనిన సమయము ఏదైనను, ఈ పరిచ్ఛేదము ననుసరించి తిరిగి రిజిస్టరు చేయబడుటకు దానిని 1917 సెప్టెంబరు పన్నెండవ దినము నుండి మూడు మాసముల లోపల సమర్పించవచ్చును లేక సమర్పింపజేయవచ్చును.

అనేక వ్యక్తులు విభిన్న సమయములలో నిష్పాదించిన దస్తావేజులు.

24. ఒక దస్తావేజును అనేకమంది వ్యక్తులు విభిన్న సమయములలో నిష్పాదించినయెడల, అట్టి దస్తావేజును ప్రతియొక నిష్పాదన తేదీ నుండి నాలుగు మాసముల లోపల రిజిస్టరు చేయుటకును తిరిగి రిజిస్టరు చేయబడుటకును సమర్పించవచ్చును.

సమర్పించుటలో ఆలస్యము అనివార్యమైనదైనయెడల నిబంధన.

25. (1) అత్యావశ్యకత వలనగాని అనివార్యమైన దుర్ఘటన వలన గాని భారత దేశములో నిష్పాదించబడిన ఏదేని దస్తావేజు లేక చేయబడిన ఏదేని డిక్రీ లేక ఉత్తరువు యొక్క నకలు, ఇందు ఇంతకు పూర్వము ఆ విషయమై విహితము చేయబడిన గడువు ముగియువరకు రిజిస్ట్రీకొరకు సమర్పింపబడకుండినచో, సమర్పించుటలోని ఆలస్యము నాలుగు మాసములకు మించకుండిన సందర్భములలో రిజిస్ట్రారు, సముచితమైన రిజిస్ట్రీ ఫీజు మొత్తమునకు పదిరెట్లకు మించని జుర్మానా చెల్లింపుపై అట్టి దస్తావేజును రిజిస్టరు చేయుటకు స్వీకరించవలెనని ఆదేశించవచ్చును.

(2) అట్టి ఆదేశము కొరకైన ఏదేని దరఖాస్తును సబ్‌రిజిస్ట్రారుకు దాఖలు చేయవచ్చును. అతడు దానిని, తాను ఎవరికి అధీనస్థుడైయున్నాడో ఆ రిజిస్ట్రారుకు పంపవలెను.

భారతదేశము వెలుపల నిష్పాదించబడిన దస్తావేజులు.

26. పక్షకారులందరుగాని వారిలో ఎవరైననుగాని భారతదేశము వెలుపల నిష్పాదించినట్లు తాత్పర్యమగు ఏదేని దస్తావేజు, ఇందు ఇంతకు పూర్వము ఆ విషయమున విహితము చేయబడిన గడువు ముగియు వరకు రిజిస్ట్రీకొరకు సమర్పింపబడనపుడు, రిజిస్ట్రీ అధికారి–

(ఏ) ఆ పత్రము అట్లు నిష్పాదించబడినదని, మరియు

(బీ) అది భారతదేశములోనికి వచ్చిన పిమ్మట నాలుగు మాసముల లోపల రిజిస్ట్రీకొరకు సమర్పించబడినదని,

తృప్తిచెందినచో, అతడు–

సముచిత రిజిస్ట్రీ ఫీజు చెల్లింపుపై అట్టి దస్తావేజును రిజిస్ట్రీ కొరకు స్వీకరించ వచ్చును.

వీలునామాలను ఏ సమయములో నైనను సమర్పించ వచ్చును లేదా డిపాజిటు చేయవచ్చును.

27. వీలునామాను ఇందు ఇటు పిమ్మట నిబంధింపబడిన రీతిగా ఏ సమయములో నైనను, రిజిస్ట్రీకొరకు సమర్పించవచ్చును, లేక డిపాజిటు చేయవచ్చును.

భాగము 5.

## రిజిస్ట్రీకరణ స్థానమును గురించి.

భూమికి సంబంధించిన దస్తావేజులను రిజిస్టరుచేయు స్థానము.

28. ఈ భాగములో వేరు విధముగా నిబంధించబడిననే తప్ప, 17వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)లోని ఖండములు (ఏ), (బీ), (సీ), (డీ) మరియు (ఈ)లలోను, 17వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2)లోను పేర్కొనిన ప్రతి దస్తావేజును, అట్టి దస్తావేజు స్థిరాస్తిని గురిచేయునదైయున్నంతమేరకు, మరియు 18వ పరిచ్ఛేదపు, ఖండము (ఏ), (బీ), (సీ) మరియు (సీసీ)లలో పేర్కొనిన ప్రతి దస్తావేజును, అది ఏ ఆస్తికి సంబంధించినదో ఆ ఆస్తి పూర్తిగాగాని అందు కొంత భాగముగాని ఎవరి ఉపజిల్లాలో ఉన్నదో ఆ సబ్‌రిజిస్ట్రారు కార్యాలయములో రిజిస్ట్రీ కొరకు సమర్పించవలెను.

ఇతర దస్తావేజులను రిజిస్టరు చేయు స్థానము.

29. (1) 28వ పరిచ్ఛేదములో నిర్దేశించిన దస్తావేజు కానట్టి లేక ఏదేని డిక్రీ లేక ఉత్తరువు యొక్క నకలుకానట్టి ప్రతి దస్తావేజును రిజిస్ట్రీకొరకు ఆ దస్తావేజు ఎవరి ఉపజిల్లాలో నిష్పాదించబడినదో ఆ సబ్‌రిజిస్ట్రారు కార్యాలయములో గాని, లేక ఆ దస్తావేజును నిష్పాదించు మరియు దాని క్రింద క్లెయిముచేయు వ్యక్తులందరూ దానిని రిజిస్టరు చేయుటకు కోరుకొనునట్టి, రాజ్యప్రభుత్వము క్రింది ఏదేని ఇతర సబ్ రిజిస్ట్రారు కార్యాలయములో గాని సమర్పించవచ్చును.

(2) డిక్రీ లేక ఉత్తరువు యొక్క నకలును, రిజిస్ట్రీకొరకు, దాని మూల డిక్రీ లేక ఉత్తరువు ఎవరి ఉపజిల్లాలో చేయబడినదో ఆ సబ్‌రిజిస్ట్రారు కార్యాలయములోగాని, ఆ డిక్రీ లేక ఉత్తరువు స్థిరాస్తిని గురిచేయునదికానిచో, ఆ డిక్రీ లేక ఉత్తరువు క్రింద క్లెయిముచేయు వ్యక్తులందరు ఆ నకలును రిజిస్టరు చేయుటకు కోరుకొనునట్టి, రాజ్యప్రభుత్వము క్రింది ఏదేని ఇతర సబ్‌రిజిస్ట్రారు కార్యాలయములోగాని సమర్పించవచ్చును.

కొన్ని సందర్భములలో రిజిస్ట్రార్లచే రిజిస్ట్రీకరణ.

30. (1) ఏ రిజిస్ట్రారైనను తన వివేచనానుసారము, తనకు అధీనస్థుడైన ఎవరేని సబ్‌రిజిస్ట్రారుచే రిజిస్టరు చేయబడదగిన ఏదేని దస్తావేజును స్వీకరించి రిజిస్టరు చేయవచ్చును.

(2) ఒక ప్రెసిడెన్సీ పట్టణము చేరియున్న జిల్లా యొక్క రిజిస్ట్రారు మరియు ఢిల్లీ జిల్లా యొక్క రిజిస్ట్రారు, 28వ పరిచ్ఛేదములో నిర్దేశింపబడిన ఏ దస్తావేజు నైనను అది ఏ ఆస్తికి సంబంధించినదో ఆ ఆస్తి భారతదేశపు ఏ భాగములో ఉన్నదను [illegible] స్వీకరించి, రిజిస్టరు చేయవచ్చును.

31· మామూలు సందర్భములలో ఈ చట్టము క్రింద దస్తావేజు రిజిస్ట్రీ లేక డిపాజిటు, వాటిని రిజిస్ట్రీకొరకు లేక డిపాజిటుకొరకు స్వీకరించుటకు అధికారము పొందిన అధికారి కార్యాలయములోనే చేయబడవలెను: ప్రైవేటు నివాసములో రిజిస్ట్రరుచేయుట లేక డిపాజిటు చేయుటను స్వీకరించుట·

అయితే, అట్టి అధికారి ప్రత్యేకమైన కారణము చూపబడిన మీదట రిజిస్ట్రీ కొరకు దస్తావేజును సమర్పించగోరు లేక వీలునామాను డిపాజిటు చేయగోరు ఏ వ్యక్తి నివాసమునకైనను వెళ్లి అచట అట్టి దస్తావేజును రిజిస్ట్రరు చేయుటకు లేక వీలునామాను డిపాజిటు చేయుటకు స్వీకరించవచ్చును·

భాగము 6·

## రిజిస్ట్రీకొరకు దస్తావేజులను సమర్పించుటను గురించి·

32· 31వ, 88వ, మరియు 89వ పరిచ్ఛేదములలో పేర్కొనిన సందర్భములలో తప్ప, ఈ చట్టము క్రింద రిజిస్ట్రరు చేయవలసిన ప్రతియొక దస్తావేజును, అట్టి రిజిస్ట్రీ తప్పనిసరియైనదైనను లేక అభిమతమునుబట్టి చేయవలసినదైనను సముచిత రిజిస్ట్రీకరణ కార్యాలయములో– రిజిస్ట్రీకొరకు దస్తావేజులను సమర్పించు వ్యక్తులు·

(ఏ) దానిని నిష్పాదించు లేక దాని క్రింద క్లెయిముచేయు, లేక ఒక డిక్రీ లేక ఉత్తరువు యొక్క నకలు విషయములో, ఆ డిక్రీ లేక ఉత్తరువు క్రింద క్లెయిము చేయు ఎవరేని వ్యక్తిచే, లేక

(బీ) అట్టి వ్యక్తి యొక్క ప్రతినిధిచే లేక హస్తాంతరణదారుచే, లేక

(సీ) ఇందు ఇటు పిమ్మట పేర్కొనిన రీతిగా నిష్పాదింపబడి అధిప్రమాణీకరింప బడిన ముక్తారునామా ద్వారా తగురీతిగా ప్రాధికారము పొందిన, అట్టి-వ్యక్తి యొక్క, ప్రతినిధియొక్క లేక హస్తాంతరణదారుయొక్క ఏజెంటుచే,

సమర్పించబడవలెను·

33· (1) 32వ పరిచ్ఛేదపు ప్రయోజనముల కొరకు, ఈ క్రింది ముక్తారు నామాలను మాత్రమే గుర్తించవలెను, అవేవనగా:– 32వ పరిచ్ఛేదపు ప్రయోజనముల కొరకు గుర్తింప దగిన ముక్తారు నామా·

(ఏ) ముక్తారునామాను నిష్పాదించు సమయమున యజమాని, భారత దేశములో ఈ చట్టము తత్సమయమున అమలులోనున్నట్టి ఏదేని భాగములో, నివసించుచున్నచో, ఆ యజమాని ఎవరి జిల్లా లేక ఉపజిల్లాలో నివసించుచుండునో ఆ రిజిస్ట్రారు లేక సబ్‌రిజిస్ట్రారు సమక్షమున నిష్పాదించబడి అతనిచే అధిప్రమాణీకరించ బడిన ముక్తారునామా;

(బీ) పైన చెప్పబడిన సమయమున యజమాని, భారతదేశములో ఈ చట్టము అమలులోలేని ఏదేని భాగములో నివసించుచున్నచో, ఎవరేని. మెజిస్ట్రేటు సమక్షమున నిష్పాదించబడి అతనిచే అధిప్రమాణీకరించబడిన ముక్తారునామా;

(సీ) పైన చెప్పబడిన సమయమున యజమాని భారతదేశములో నివసించు చుండనిచో, ఎవరేని నోటరీ పబ్లికు, లేక ఏదేని న్యాయస్థానము, న్యాయాధీశుడు, మెజిస్ట్రేటు, భారతీయ కాన్సల్, లేక వైస్–కాన్సల్ లేక కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి సమక్షమున నిష్పాదించబడి అతనిచే అధిప్రమాణీకరించబడిన ముక్తారునామా:

అయితే, ఈ పరిచ్ఛేదములోని ఖండములు (ఏ) మరియు (బీ)లలో పేర్కొనినట్టి ఏదేని ముక్తారునామాను నిష్పాదించుట కొరకు ఈ క్రింది వ్యక్తులు ఏదేని

రిజిస్ట్రీకరణ కార్యాలయములోగాని న్యాయస్థానములోగాని హాజరు కావలెనని కోరబడ రాదు; వారెవరు అనగా:-

(i) శారీరకమైన అశక్తత కారణముగ ప్రమాదమునకు గురికాకుండ లేక తీవ్రమైన అసౌకర్యము కలుగకుండ అట్లు హాజరుకాలేని వ్యక్తులు;

(ii) సివిలు లేక క్రిమినలు ఆదేశికల క్రింద జైలులోనున్న వ్యక్తులు; మరియు

(iii) న్యాయస్థానములో స్వయముగా హాజరగుట నుండి శాసనరీత్యా మినహాయించబడిన వ్యక్తులు.

<u>విశదీకరణ</u>:- ఈ ఉపపరిచ్ఛేదములో "భారతదేశము" అనగా, సాధారణ
1987 లోని 10వ చట్టము. ఖండముల చట్టము, 1897 యొక్క 3వ పరిచ్ఛేదములోని ఖండము (28)లో నిర్వచింపబడిన భారతదేశము అని అర్థము.

(2) అట్టి ప్రతి వ్యక్తి విషయములో ఆ ముక్తారునామా యజమానిగా తాత్పర్యమగు వ్యక్తిచే స్వచ్ఛందముగా నిష్పాదించబడినదని తృప్తిచెందినచో, సందర్భాను సారముగా, రిజిస్ట్రారు లేక సబ్‌రిజిస్ట్రారు లేక మేజిస్ట్రేటు పైన చెప్పబడిన కార్యాలయములోగాని న్యాయస్థానములోగాని అతడు స్వయముగా హాజరుకావలెనని కోరకుండ దానిని సాక్ష్యాంకనము చేయవచ్చును.

(3) నిష్పాదన స్వచ్ఛందముగా చేయబడినదను సాక్ష్యము సేకరించుటకు, రిజిస్ట్రారుగాని, సబ్‌రిజిస్ట్రారుగాని లేక మేజిస్ట్రేటుగాని తానే ఆ యజమానిగా తాత్పర్యమగు వ్యక్తి ఇంటికిగాని అతడు పరిరోధించబడియున్న జైలుకుగాని స్వయముగా వెళ్లి అతనిని పరీక్షించవచ్చును లేదా అతనిని పరీక్షించుటకు కమీషనును పంపవచ్చును.

(4) ఈ పరిచ్ఛేదములో పేర్కొనిన ఏ ముక్తారునామాయైనను, ఈ విషయములో ఇందు ఇంతకు పూర్వము పేర్కొనిన వ్యక్తియొక్క లేక న్యాయస్థానము యొక్క సమక్షములో నిష్పాదింపబడి ఆ వ్యక్తిచే గాని న్యాయస్థానముచే గాని అధిప్రమాణీకరించబడినదని దానిని చూడగనే తాత్పర్యమగునపుడు, ఇంకెట్టి రుజువు లేకుండనే దానిని దాఖలుచేసి రుజువు చేయవచ్చును

రిజిస్ట్రీ చేయుటకు ముందు రిజిస్ట్రీ అధికారిచే పరిశీలన.

34. (1) ఈ భాగములోనుమరియు 41వ, 43వ, 45వ, 69వ, 75వ, 77వ, 88వ మరియు 89వ పరిచ్ఛేదములలోని నిబంధనలకు లోబడి, దస్తావేజు ఏదియు, అట్టి దస్తావేజును నిష్పాదించు వ్యక్తులు, లేక వారి ప్రతినిధులు, హస్తాంతరణదారులు, లేక పైన చెప్పబడినట్లు ప్రాధికారమీయబడిన ఏజెంట్లు, 23వ, 24వ, 25వ మరియు 26వ పరిచ్ఛేదముల క్రింద సమర్పించుటకు అనుమతించబడిన గడువులోపల రిజిస్ట్రీ అధికారి సమక్షమున హాజరైననే తప్ప, ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయబడరాదు:

అయితే, అత్యావశ్యకత వలనగాని అనివార్యమైన దుర్ఘటనవలనగాని అట్టి వ్యక్తులందరూ అట్లు హాజరుకాలేనిచో, హాజరగుటలోని ఆలస్యము నాలుగుమాసములకు మించనియెడల, 25వ పరిచ్ఛేదము క్రింద ఏదేని జుర్మానా చెల్లింపబడవలసి యున్నచో అట్టి జుర్మానాకు అదనముగా సరియైన రిజిస్ట్రీ ఫీజు మొత్తమునకు పదిరెట్లకు మించని జుర్మానా చెల్లించిన మీదట రిజిస్ట్రారు ఆ దస్తావేజును రిజిస్టరు చేయవచ్చునని ఆదేశించవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద ఏకకాలములోగాని వేరువేరు సమయములలో గాని హాజరుకావచ్చును.

(3) అటుపై రిజిస్ట్రీ అధికారి–

(ఏ) అట్టి దస్తావేజు ఎవరిచే నిష్పాదించబడినట్లు తాత్పర్యమగు చున్నదో వారిచే అది నిష్పాదించబడినదా లేదా అను దానిని గూర్చి పరిశీలించవలెను.

(బీ) తన సమక్షమున హాజరై ఆ దస్తావేజును తాము నిష్పాదించినట్లు చెప్పుచున్న వ్యక్తులు ఆ వ్యక్తులేనని రూఢి చేసికొనవలెను; మరియు

(సీ) ప్రతినిధిగా, హస్తాంతరణదారుగా లేక ఏజెంటుగా హాజరగు ఎవరేని వ్యక్తి విషయములో, అట్లు హాజరగుటకు అట్టి వ్యక్తికి హక్కుగలదనుటను రూఢి చేసికొనవలెను.

(4) ఉపపరిచ్ఛేదము (1)కి గల వినాయింపు క్రింద ఆదేశముకొరకు ఏదేని దరఖాస్తును సబ్‌రిజిస్ట్రారుకు పెట్టుకొనవచ్చును, అతడు దానిని తాను ఎవరికి అధీనస్థుడైయున్నాడో ఆ రిజిస్ట్రారుకు పంపవలెను.

(5) ఈ పరిచ్ఛేదములోనున్నదేదియు డిక్రీల లేక ఉత్తరువుల నకళ్లకు వర్తించదు.

35. (1) (ఏ) దస్తావేజును నిష్పాదించు వ్యక్తులందరు రిజిస్ట్రీ అధికారి సమక్షమున స్వయముగా హాజరైయుండి, వారు స్వయముగా అతడెరిగిన వారై యున్నచో లేక అన్యథా, వారు ఎవరిమని చెప్పుకొనుచున్నారో, వారు వారేనని అతనికి రూఢియైనచో మరియు వారందరు ఆ దస్తావేజును తామే నిష్పాదించితిమని ఒప్పు కొనినచో, లేక నిష్పాదించినట్లు ఒప్పుకొనిన మీదట మరియు నిష్పాదించలేదనిన మీదట ప్రక్రియ

(బీ) ప్రతినిధి, హస్తాంతరణదారు లేక ఏజెంటు హాజరగు ఎవరేని వ్యక్తి విషయములో, అట్టి ప్రతినిధి, హస్తాంతరణదారు లేక ఏజెంటు ఆ నిష్పాదనను ఒప్పు కొనుచో, లేక

(సీ) దస్తావేజును నిష్పాదించు వ్యక్తి మరణించియుండి, అతని ప్రతినిధి, లేక హస్తాంతరణదారు, రిజిస్ట్రీ అధికారి సమక్షమున హాజరై ఆ నిష్పాదనను ఒప్పుకొనుచో,

రిజిస్ట్రీ అధికారి, 58 నుండి 61 వరకు గల (ఈ రెంటిని కలుపుకొని) పరిచ్ఛేదములలో ఆదేశించబడినట్లు ఆ దస్తావేజును రిజిస్టరు చేయవలెను.

(2) రిజిస్ట్రీ అధికారి, తన సమక్షమున హాజరైన వ్యక్తులు తాము ఎవరిమని చెప్పుకొనుచున్నారో వారు వారేనని తాను రూఢి చేసుకొనుటకుగాను, లేక ఈ చట్టము ద్వారా ఉద్దేశింపబడిన ఏదేని ఇతర ప్రయోజనము కొరకు, తన కార్యాలయములో హాజరైయున్న వారిలో ఎవరినైనను పరీక్షించవచ్చును.

(3) (ఏ) దస్తావేజు ఎవరిచే నిష్పాదించబడినట్లు తాత్పర్యమగునో ఆ వ్యక్తి దానిని తాను నిష్పాదించలేదనినచో, లేక

(బీ) అట్టి ఏ వ్యక్తియైనను మైనరు, ఇడుడు లేక ఉన్మాది అని రిజిస్ట్రీ అధికారికి తోచినచో, లేక

(సీ) దస్తావేజు ఎవరిచే నిష్పాదించబడినట్లు తాత్పర్యమగునో ఆ వ్యక్తి మరణించినచో లేక అతని ప్రతినిధి లేక హస్తాంతరణదారు దానిని నిష్పాదించలేదనినచో

అట్లు నిష్పాదించలేదనిన, మైనరు, జడుడు, ఉన్మాది అని తోచిన, లేక మరణించిన వ్యక్తికి సంబంధించినంత వరకు ఆ దస్తావేజును రిజిస్టరు చేయుటకు రిజిస్ట్రీ అధికారి నిరాకరించవలెను:

అయితే, అట్టి అధికారి ఒక రిజిస్ట్రారు అయినచో, అతడు భాగము 12లో నిర్దేశించబడిన ప్రక్రియను అనుసరించవలెను.

అంతేగాక, రాజ్యప్రభుత్వము, రాజపత్రములో అధిసూచన ద్వారా, అందు పేర్కొనబడిన ఎవరేని సబ్‌రిజిస్ట్రారును, నిష్పాదించలేదనబడిన దస్తావేజుల విషయములో ఈ ఉపపరిచ్ఛేదము యొక్కయు భాగము 12 యొక్కయు ప్రయోజనముల కొరకు రిజిస్ట్రారుగా భావించవలెనని ప్రఖ్యానించవచ్చును.

## భాగము 7.

## నిష్పాదన కర్తలను, సాక్షులను హాజరగునట్లు చేయుటను గురించి.

నిష్పాదనకర్త లేక సాక్షి హాజరుకావలెనని కోరబడినచో ప్రక్రియ.

36. రిజిస్ట్రీ కొరకు ఏదేని దస్తావేజును సమర్పించు లేక అట్లు సమర్పించుటకు వీలున్న ఏదేని దస్తావేజు క్రింద క్లెయిముచేయు, ఎవరేని వ్యక్తి, అట్టి దస్తావేజును రిజిస్ట్రీ చేయుటకు ఎవరి హాజరీ లేక వాఙ్మూప సాక్ష్యము అవసరమై యున్నదో ఆ వ్యక్తి హాజరుకావలెనని కోరినచో రిజిస్ట్రీ అధికారి, తన వివేచనాను సారముగా సమనులో తెలుపబడినట్లు స్వయముగాగాని ప్రాధికృతుడైన ఏజెంటు ద్వారా గాని అందు తెలిపిన సమయమున రిజిస్ట్రీకరణ కార్యాలయములో ఆ వ్యక్తి హాజరు కావలెనని సమను జారీచేయవలసినదిగా, రాజ్యప్రభుత్వము ఈ విషయమున ఆదేశించు నట్టి అధికారిని లేక న్యాయస్థానమును కోరవచ్చును.

అధికారి, లేక న్యాయస్థానము సమను/జారీచేసి తామీలుచేయించ వలసియుండుట.

37. అట్టి కేసులలో చెల్లింపవలసిన ప్యూను ఫీజు ముట్టిన మీదట ఆ అధికారి గాని న్యాయస్థానముగాని ఆ ప్రకారము సమను జారీచేయవలెను, మరియు ఎవరు అట్లు హాజరు కావలెనని కోరబడినాడో ఆ వ్యక్తిపై దానిని తామీలు చేయించవలెను.

రిజిస్ట్రీకరణ కార్యాలయములో హాజరగుటనుండి మినహాయింప బడిన వ్యక్తులు.

38. (1) (ఏ) శారీరకమైన అశక్తత కారణముగ ముప్పుకు లేక తీవ్రమైన అసౌకర్యము కలుగకుండ రిజిస్ట్రీకరణ కార్యాలయములో హాజరుకాలేని వ్యక్తిని, లేక

(బీ) సివిలు లేక క్రిమినలు ఆదేశికల క్రింద జైలులోనున్న వ్యక్తిని, లేక

(సీ) న్యాయస్థానములో స్వయముగా హాజరగుట నుండి శాసనరీత్యా మినహాయింపబడినట్టి ఇందు ఇటు పిమ్మట దీని తరువాతగల నిబంధన లేకుండినచో రిజిస్ట్రీ కరణ కార్యాలయములో హాజరుకావలసియుండెడి వ్యక్తులను,

అట్లు హాజరుకావలెనని కోరరాదు.

(2) అట్టి ప్రతి వ్యక్తి విషయములోను, రిజిస్ట్రీ అధికారి తానే అట్టి వ్యక్తి ఇంటికిగాని, లేక అతడు పరిరోధించబడియున్న జైలుకుగాని స్వయముగా వెళ్లి అతనిని పరీక్షించవచ్చును లేదా అతనిని పరీక్షించుటకు కమీషనును పంపవచ్చును.

సమన్లు, కమీషన్లు, మరియు సాక్షులను గురించి శాసనము.

39. సివిలు న్యాయస్థానముల సమక్షమునగల దావాలలో సమన్లు, కమీషన్లు సాక్షులను తప్పనిసరిగా హాజరగునట్లు చేయుటను గురించియు వారి ప్రతిమూల్యము కొరకును తత్సమయమున అమలులోనున్న శాసనము, పైన చెప్పినట్లు తప్ప మరియు ఆవశ్యకమైన మార్పులతో, ఈ చట్టపు నిబంధనల క్రింద జారీ చేయబడిన ఏదేని సమనుకు, లేక కమీషనుకు మరియు హాజరగుటకు సమను చేయబడిన ఎవరేని వ్యక్తికి వర్తించును.

## భాగము 8.

## వీలునామాలను మరియు దత్తు తీసికొనుటకైన ప్రాధికార పత్రములను సమర్పించుటను గురించి.

*వీలునామాలను మరియు దత్తు తీసికొనుటకైన ప్రాధికార పత్రములను సమర్పించుటకు హక్కుగల వ్యక్తులు.*

40. (1) మరణశాసనకర్త లేక అతడు మరణించిన తరువాత వీలునామా క్రింద నిర్వాహకుడుగాగాని అన్యథాగాని క్లెయిముచేయు ఎవరేని వ్యక్తి ఆ వీలునామాను రిజిస్ట్రీకొరకు ఎవరేని రిజిస్ట్రారుకు లేక సబ్‌రిజిస్ట్రారుకు సమర్పించవచ్చును.

(2) దత్తుతీసుకొనుటకైన ప్రాధికారదాతగాని, అతడు మరణించిన తరువాత అట్టి ప్రాధికారదానగ్రహీతగాని లేక దత్తపుత్రుడుగాని ఆ రిజిస్ట్రీకొరకు ఆ ప్రాధికార పత్రమును ఎవరేని రిజిస్ట్రారుకు లేక సబ్‌రిజిస్ట్రారుకు సమర్పించవచ్చును.

*వీలునామాల మరియు దత్తుతీసి కొనుటకైన ప్రాధికార పత్రముల రిజిస్ట్రీ.*

41. (1) మరణశాసనకర్తచే గాని ప్రాధికారదాతచేగాని రిజిస్ట్రీకొరకు సమర్పించబడిన వీలునామాను లేక దత్తుతీసుకొనుటకైన ప్రాధికార పత్రమును ఏదేని ఇతర దస్తావేజును రిజిస్ట్రీ చేయురీతిగానే రిజిస్టరు చేయవచ్చును.

(2) సమర్పించుటకు హక్కుగల ఎవరేని ఇతర వ్యక్తిచే రిజిస్ట్రీకొరకు సమర్పించబడిన వీలునామాను, లేక దత్తు తీసికొనుటకైన ప్రాధికార పత్రమును–

(ఏ) ఆ వీలునామాను లేక ప్రాధికార పత్రమును మరణశాసనకర్త లేక సందర్భానుసారముగా ప్రాధికారదాత నిష్పాదించినాడని,

(బీ) మరణశాసనకర్త లేక ప్రాధికారదాత మరణించినాడని, మరియు

(సీ) ఆ వీలునామాను లేక ప్రాధికార పత్రమును సమర్పించు వ్యక్తి, 40వ పరిచ్ఛేదము క్రింద దానిని సమర్పించుటకు హక్కు కలిగియున్నాడని,

రిజిస్ట్రీ అధికారి రూఢిగా అభిప్రాయపడినచో రిజిస్టరు చేయవలెను.

## భాగము 9.

## వీలునామాలను డిపాజిటు చేయుటను గురించి.

*వీలునామాలను డిపాజిటు చేయుట.*

42. ఎవరేని మరణశాసనకర్త తన వీలునామాను సీలుతో మూసిన కవరులో ఉంచి దానిపై తన పేరును, తన ఏజెంటు (ఎవరైన ఉన్నచో) అతని పేరును ఆ దస్తావేజు స్వభావమును వ్రాసి స్వయముగా గాని తగురీతిగా ప్రాధికారమీయబడిన ఏజెంటు ద్వారా గాని ఎవరేని రిజిస్ట్రారు వద్ద డిపాజిటు చేయవచ్చును.

*వీలునామాలను డిపాజిటుచేసిన మీదట ప్రక్రియ.*

43. (1) అట్టి కవరు అందిన మీదట, రిజిస్ట్రారు, దానిని డిపాజిటు చేయుటకై సమర్పించు వ్యక్తి మరణశాసనకర్త అని లేక అతని ఏజెంటు అని రూఢిగా అభిప్రాయపడినచో పైన చెప్పినట్లుగా కవరుపై వ్రాసియున్న దానిని తన రిజిస్టరు పుస్తకము సంఖ్య 5లో వ్రాసుకొనవలెను. ఆ పుస్తకములోను మరియు ఆ కవరుపైనను అది ఏ సంవత్సరము, ఏ మాసము, ఏ దినమున ఏ వేళకు సమర్పించబడినది మరియు అందినది మరియు మరణశాసనకర్తను లేక అతని ఏజెంటును ఆనవాలుపట్టు వ్యక్తుల పేర్లను కవరుయొక్క సీలుపై సుస్పష్టముగా చదువుటకు వీలున్న మాటలను వ్రాసుకొన వలెను.

(2) అప్పుడు రిజిస్ట్రారు ఆ సీలు కవరును అగ్ని నిరోధకపు పెట్టెలో పెట్టి ఉంచవలెను.

*42వ పరిచ్ఛేదము క్రింద డిపాజిటు చేసిన సీలు కవరును వాపసు తీసికొనుట*

44. అట్టి కవరును డిపాజిటు చేసిన మరణశాసనకర్త దానిని వాపసు తీసికొన గోరినచో, దానిని డిపాజిటుగా కలిగియున్న రిజిస్ట్రారుకు అతడు స్వయముగా గాని లేక తగురీతిగా ప్రాధికారమీయబడిన ఏజెంటు ద్వారాగాని దరఖాస్తు చేయవచ్చును; మరియు దరాఖాస్తుదారు వాస్తవముగా ఆ మరణశాసనకర్తయే అని లేక అతని ఏజెంటు అని రూఢియైనచో అట్టి రిజిస్ట్రారు ఆ కవరును ఆ ప్రకారము ఇచ్చివేయవలెను.

*డిపాజిటుదారు మరణించినమీదట ప్రక్రియ.*

45. (1) 42వ పరిచ్ఛేదము క్రింద ఒక సీలు కవరును డిపాజిటు చేసిన మరణశాసనకర్త మరణించిన పిమ్మట, దానిని డిపాజిటుగా కలిగియున్న రిజిస్ట్రారుకు దానిని తెరచుటకు దరఖాస్తు చేయబడినచో మరియు ఆ మరణశాసనకర్త మరణించినాడని రిజిస్ట్రారుకు రూఢియైనచో అతడు దరఖాస్తుదారు సమక్షములో ఆ కవరును తెరువ వలెను మరియు దరఖాస్తుదారుని ఖర్చుపై తన పుస్తకము సంఖ్య 3లో అందలి విషయములను నకలు చేయించవలెను.

(2) అట్టి నకలు చేయబడినప్పుడు, ఆ రిజిస్ట్రారు ఆ అసలు వీలునామాను తిరిగి డిపాజిటు చేయవలెను.

*కొన్ని అధి శాసనముల మరియు న్యాయస్థానముల యొక్క అధికారముల వ్యావృత్తి*

46. (1) ఇందు ఇంతకు పూర్వము ఉన్నదేదియు భారత ఉత్తరాధికార చట్టము, 1865 (1865లోని 10వ చట్టము) లోని 259వ పరిచ్ఛేదము యొక్క, లేక ప్రొబేటు మరియు ఎడ్మినిస్ట్రేషన్ చట్టము, 1881 (1881లోని 5వ చట్టము) లోని 81వ పరిచ్ఛేదము యొక్క నిబంధనలకు లేక ఉత్తరువు ద్వారా ఏదేని వీలునామాను తప్పనిసరిగా దాఖలు చేయించుటకు ఏదేని న్యాయస్థానమునకుగల అధికారమునకు భంగము కలిగించదు.

(2) ఏదేని అట్టి ఉత్తరువు చేయబడినప్పుడు, 45వ పరిచ్ఛేదము క్రింద ఆ వీలునామా అంతకుముందే నకలు చేయబడిననే తప్ప, రిజిస్ట్రారు ఆ కవరు తెరచి, ఆ వీలునామాను తన పుస్తకము సంఖ్య 3లో నకలు చేయించి అట్టి నకలుపై, దాని అసలు ప్రతిని పైనచెప్పబడిన న్యాయస్థానపు ఉత్తరువు ననుసరించి న్యాయస్థానమునకు పంపబడినదని టిప్పణి (నోటు) వ్రాయవలెను.

భాగము 10.

## రిజిస్టరు చేయుటవలని మరియు రిజిస్టరు చేయకుండుటవలని ప్రభావములను గురించి.

*రిజిస్ట్రీకృత దస్తావేజు ఎప్పటినుండి అమలగును.*

47. రిజిస్ట్రీకృత దస్తావేజు, అది రిజిస్ట్రీ చేయనక్కరలేనిదైనచో లేక చేయబడ కుండినచో ఎప్పటి నుండి ప్రారంభమైయుండెడిదో అప్పటి నుండి అమలగును; అది రిజిస్టరు చేసినప్పటి నుండి కాదు.

*ఆస్తికి సంబంధించిన రిజిస్ట్రీకృత దస్తావేజులు వాగ్రూపకరారులకు వ్యతిరేకముగా ఎప్పుడు అమలగును.*

48. ఈ చట్టము క్రింద తగురీతిగా రిజిస్టరు చేయబడినట్టి, స్థిర చరాస్తులలో దేనికైనను సంబంధించినవై మరణశాసనములు కానట్టి దస్తావేజులన్నియు అట్టి ఆస్తికి సంబంధించిన ఏదేని వాగ్రూప కరారుకు లేక ప్రఖ్యానమునకు వ్యతిరేకముగా, – ఆ కరారు, లేక ప్రఖ్యానముతోబాటు లేక దాని తరువాత స్వాధీనము కూడ చేయబడి, అది తత్సమయమున అమలులోనున్న ఏదేని శాసనము క్రింద శాసనమాన్యమైన అంతరణ అయియుండిననే తప్ప– అమలగును:

*1882 లోని 4వ చట్టము*

అయితే, ఆస్తి అంతరణ చట్టము, 1882 యొక్క 58వ పరిచ్ఛేదములో నిర్వచించబడినట్లు హక్కుమూలపత్రములను డిపాజిటుచేయుట ద్వారా పెట్టినతాకట్టు, అదే ఆస్తికి సంబంధించి ఆ తరువాత నిష్పాదించబడి, రిజిస్టరు చేయబడిన ఏదేని తాకట్టు పత్రమునకు వ్యతిరేకముగా అమలు అగును.

49. 17వ పరిచ్ఛేదమునుబట్టి గాని ఆస్తి అంతరణ చట్టము, 1882 యొక్క ఏదేని నిబంధననుబట్టి గాని రిజిస్టరు చేయబడవలసిన దస్తావేజేదియు అది రిజిస్టరు చేయబడిననే తప్ప–

రిజిస్టరు చేయవలసిన దస్తావేజులను రిజిస్టరు చేయకుండుట వలన ప్రభావము.

(ఏ) దానిలో చేరియున్న ఏ స్థిరాస్తినైనను దాని ప్రభావమునకు గురిచేయదు; లేక

(బీ) దత్తుచేసికొనుటకు ఏ అధికారమునైనను ఒసగదు; లేక

(సీ) అట్టి ఆస్తిని గురిచేయునట్టి లేక అట్టి అధికారమును ప్రదత్తము చేయునట్టి ఏ వ్యవహారమునకైనను సాక్ష్యముగా స్వీకరించబడదు:

అయితే, స్థిరాస్తిని గురిచేయునదైయుండి ఈ చట్టమునుబట్టిగాని ఆస్తి అంతరణ చట్టము, 1882ను బట్టిగాని, రిజిస్టరు చేయవలసినదైయుండి రిజిస్టరు కాని దస్తావేజును నిర్దిష్టపరిహార చట్టము, 1877 యొక్క అధ్యాయము – 2 క్రింద నిర్దిష్ట నిర్వర్తన కొరకైన దావాలో ఒక కాంట్రాక్టుకు సాక్ష్యముగా, లేక ఆస్తి అంతరణ చట్టము, 1882 యొక్క 53–ఏవ పరిచ్ఛేద ప్రయోజనముల కొరకు కాంట్రాక్టు భాగత: నిర్వర్తించబడినదనుటకు సాక్ష్యముగా లేక రిజిస్ట్రీకృత దస్తావేజు ద్వారా జరుపనక్కరలేని ఏదేని సంపార్శ్విక వ్యవహారమునకు సాక్ష్యముగా స్వీకరించ వచ్చును.

50. (1) 17వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)లోని ఖండములు (ఏ), (బీ), (సీ) మరియు (డీ)లలోను మరియు 18వ పరిచ్ఛేదము యొక్క ఖండములు (ఏ) మరియు (బీ)లలోను పేర్కొనినటువంటి ప్రతియొక దస్తావేజు, తగురీతిగా రిజిస్టరు చేయబడినచో, దానిలో చేరియున్న ఆస్తి విషయములో అదే ఆస్తికి సంబంధించినదియు ఒక డిక్రీ లేక ఉత్తరువు కానట్టిదియు అగు రిజిస్టరు కాని ప్రతియొక దస్తావేజుకు వ్యతిరేకముగా అమలగును – అట్టి రిజిస్టరుకాని దస్తావేజు ఆ రిజిస్ట్రీకృత దస్తావేజు వంటిదే అయినను కాకున్నను సరే.

భూమికి సంబంధించిన కొన్ని రిజిస్ట్రీకృత దస్తావేజులు రిజిస్టరుకాని దస్తావేజులకు వ్యతిరేకముగా అమలు అగుట.

(2) ఉపపరిచ్ఛేదము (1)లోనిదేదియు, 17వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)కి గల వినాయింపు క్రింద మినహాయించబడినట్టి లీజులకుగాని అదే పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2)లో పేర్కొనిన ఏదేని దస్తావేజుకు గాని లేక ఈ చట్ట ప్రారంభమున అమలులో ఉన్నట్టి శాసనము క్రింద పూర్వికతను కలిగియుండనట్టి ఏదేని రిజిస్ట్రీకృత దస్తావేజుకుగాని వర్తించదు.

<u>విశదీకరణ</u>:– అట్టి రిజిస్టరుకాని దస్తావేజు నిష్పాదించబడినట్టి స్థలములో మరియు అట్టి సమయమున 1864లోని 16వ చట్టము లేక భారత రిజిస్ట్రీకరణ చట్టము, 1866 అమలులోనున్న సందర్భములలో, 'రిజిస్టరు కాని' అనగా అట్టి చట్టము ననుసరించి రిజిస్టరు చేయబడినట్టిదనియు ఆ దస్తావేజు 1871 జూలై ఒకటవ దినము తరువాత నిష్పాదించబడినదైనచో భారత రిజిస్ట్రీకరణ చట్టము, 1871 క్రింద లేక భారత రిజిస్ట్రీకరణ చట్టము, 1877 లేక ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయబడనట్టిదనియు అర్థము.

1866లోని 20వ చట్టము. 1871లోని 8వ చట్టము. 1877లోని 3వ చట్టము.

## <u>భాగము 11.</u>

## <u>రిజిస్ట్రీ అధికారుల కర్తవ్యములను మరియు అధికారములను గురించి.</u>

### <u>(ఏ) రిజిస్టరు పుస్తకములు మరియు అనుక్రమణ సూచీలను గురించి.</u>

51. (1) ఈ క్రింది పుస్తకములను ఇందు ఇటు పిమ్మట తెలిపిన విభిన్న కార్యాలయములలో ఉంచవలెను అవేవనగా:–

విభిన్న కార్యాలయములలో ఉంచబడవలసిన రిజిస్టరు పుస్తకములు.

ఏ- రిజిస్ట్రీకరణ కార్యాలయములన్నిటిలో,-

పుస్తకము 1, "స్థిరాస్తికి సంబంధించి, మరణశాసనములు కానట్టి దస్తావేజుల రిజిస్టరు";

పుస్తకము 2, "రిజిస్టరు చేయుటకు నిరాకరించు కారణముల రికార్డు";

పుస్తకము 3, "వీలునామాల, మరియు దత్తు చేసికొనుటకైన ప్రాధికార పత్రముల రిజిస్టరు";

పుస్తకము 4, "వివిధ విషయముల రిజిస్టరు".

బీ- రిజిస్ట్రారుల కార్యాలయములలో-

పుస్తకము 5, "వీలునామాల డిపాజిట్ల రిజిస్టరు".

(2) స్థిరాస్తికి సంబంధించినవియు వీలునామాలు కానట్టివియు అయియుండి 17వ, 18వ, మరియు 89వ పరిచ్ఛేదముల క్రింద రిజిస్టరు చేయబడిన అన్ని దస్తావేజులను, లేక జ్ఞాపనలను పుస్తకము 1లో నమోదు చేయవలెను. లేదా ఫైలు చేయవలెను.

(3) స్థిరాస్తికి సంబంధించనివైయుండి 18వ పరిచ్ఛేదము యొక్క ఖండములు (డి) మరియు (యఫ్)ల క్రింద రిజిస్టరు చేయబడిన అన్ని దస్తావేజులను పుస్తకము 4లో నమోదు చేయవలెను.

(4) సబ్‌రిజిస్ట్రారు కార్యాలయము రిజిస్ట్రారు కార్యాలయములో సంవిలీనము చేయబడినయెడల, ఈ పరిచ్ఛేదము లోనిదేదియు పుస్తకములను ఒకటి కంటె ఎక్కువ సెట్లులో ఉంచవలెనని కోరునదిగా భావింపబడరాదు.

దస్తావేజును సమర్పించినపుడు రిజిస్ట్రీ అధికారుల కర్తవ్యములు

52. (1) (ఏ) రిజిస్ట్రీకొరకు దస్తావేజును సమర్పించు దినమును వేళను, స్థానమును, మరియు దానిని సమర్పించు ప్రతి వ్యక్తి సంతకమును, దానిని సమర్పించినపుడు అట్టి ప్రతియొక దస్తావేజుపై పృష్ఠాంకనము చేయవలెను.

(బీ) అట్టి దస్తావేజును సమర్పించు వ్యక్తికి, రిజిస్ట్రీ అధికారి దానికి రసీదు నివ్వవలెను.

(సీ) 62వ పరిచ్ఛేదములోని నిబంధనలకులోబడి, రిజిస్ట్రీకొరకు స్వీకరించబడిన ప్రతి దస్తావేజు యొక్క నకలును అనావశ్యకమైన జాప్యము లేకుండా దానిని స్వీకరించిన వరుస క్రమానుసారము దానికి సంబంధించిన పుస్తకములో వ్రాయవలెను.

(2) ఆ పుస్తకములన్నింటిని ఇన్‌స్పెక్టరు జనరలు అయా సమయములందు విహితపరచునట్టి అంతరావధులలో మరియు అట్టి రీతిగా అధిప్రమాణీకరించవలెను.

నమోదులకు క్రమానుగతముగా సంఖ్యవేయుట.

53. ప్రతి పుస్తకములోని నమోదులన్నింటికి క్రమానుగత వరుసలో సంఖ్య వేయవలెను. ఆ వరుస సంవత్సరముతో ప్రారంభమై దానితో అంతము కావలెను; ప్రతి సంవత్సరారంభమున కొత్త వరుసలను ప్రారంభించవలెను.

ప్రస్తుత అనుక్రమణికలు వాటిలోని నమోదులు.

54. ఇందు ఇంతకు పూర్వము పేర్కొనిన ఏవేని పుస్తకములు ఉంచబడు ప్రతి కార్యాలయములోను అట్టి పుస్తకములలోని విషయములను గురించి ప్రస్తుత అనుక్రమణికలు తయారు చేయబడవలెను; అట్టి అనుక్రమణికలలో ప్రతియొక నమోదును రిజిస్ట్రీ అధికారి ఆ నమోదు దేనికి సంబంధించినదో ఆ దస్తావేజును నకలు చేసిన పిమ్మట లేక ఆ దస్తావేజు జ్ఞాపనను ఫైలు చేసిన పిమ్మట ఆచరణ సాధ్యమైనంత వరకు వెనువెంటనే చేయవలెను.

55. (1) రిజిస్ట్రీకరణ కార్యాలయములన్నింటిలో అట్టి నాలుగుఅనుక్రమణికలు చేయబడవలెను; వాటిని వరుసగా అనుక్రమణిక సంఖ్య 1, అనుక్రమణిక సంఖ్య 2, అనుక్రమణిక సంఖ్య 3 మరియు అనుక్రమణిక సంఖ్య 4 అని అనవలెను.

అనుక్రమణికలను రిజిస్ట్రీ అధికారులు చేయవలసియుండుట మరియు అందలి విషయములు.

(2) పుస్తకము సంఖ్య 1లో నమోదు చేయబడిన ప్రతి దస్తావేజును లేక ఫైలు చేయబడిన ప్రతియొక జ్ఞాపనను నిష్పాదించు వ్యక్తులందరి పేర్లు అట్టి దస్తావేజు లేక జ్ఞాపన క్రింద క్లెయిముచేయు వ్యక్తులందరి పేర్లు మరియు వారిని గూర్చిన అభివర్ణనలు అనుక్రమణిక సంఖ్య 1లో ఉండవలెను.

(3) ఈ విషయములో ఇన్స్పెక్టర్ జనరలు ఆయా సమయములందు ఆదేశించునట్లు ప్రతియొక్క దస్తావేజుకు మరియు జ్ఞాపనకు సంబంధించి 21వ పరిచ్ఛేదములో పేర్కొనబడినట్టి వివరములు అనుక్రమణిక సంఖ్య 2లో ఉండవలెను.

(4) పుస్తకము సంఖ్య 3లో నమోదు చేయబడిన ప్రతియొక వీలునామాను, ప్రాధికార పత్రమును నిష్పాదించు వ్యక్తులందరి పేర్లు వాటి క్రింద నియమింపబడిన, నిర్వాహకుల మరియు వ్యక్తుల పేర్లు మరియు మరణశాసనకర్త లేక ప్రాధికారదాత మరణించిన తరువాత (అంతకుముందు కాదు) దాని క్రింద క్లెయిముచేయు వ్యక్తులందరి పేర్లు మరియు వారిని గూర్చి అభివర్ణనలు అనుక్రమణిక సంఖ్య 3లో ఉండవలెను.

(5) పుస్తకము సంఖ్య 4లో నమోదు చేయబడిన ప్రతియొక దస్తావేజును నిష్పాదించు వ్యక్తులందరి పేర్లు దాని క్రింద క్లెయిముచేయు వ్యక్తులందరి పేర్లు మరియు వారిని గూర్చిన అభివర్ణనలు అనుక్రమణిక సంఖ్య 4లో ఉండవలెను.

(6) ప్రతీయొక అనుక్రమణికలో, ఇన్స్పెక్టర్ జనరలు ఆయా సమయము లందు ఆదేశించునట్టి ఇతర వివరములు ఉండవలెను మరియు దానిని అట్టి ప్రరూపములో తయారు చేయవలెను.

56. x x x x x x x x

57. (1) ఈ విషయమున చెల్లింపదగిన ఫీజు ముందుగా చెల్లించుటకు లోబడి, 1 మరియు 2 సంఖ్యగల పుస్తకములు మరియు పుస్తకము సంఖ్య 1కి సంబంధించిన అనుక్రమణిక, వాటి తనిఖీ కొరకు దరఖాస్తు చేయు ఎవరేని వ్యక్తిచే అవి తనిఖీ చేయబడుటకు ఎల్లవేళల అందుబాటులో ఉండవలెను మరియు 62వ పరిచ్ఛేదపు నిబంధనలకు లోబడి, అట్టి పుస్తకములలోని నమోదుల నకళ్ల కొరకు దరఖాస్తుచేయు వ్యక్తులందరికి అట్టి నకళ్లను ఈయవలెను.

(2) అవే నిబంధనలకు లోబడి, పుస్తకము సంఖ్య 3లోని మరియు దానికి సంబంధించిన అనుక్రమణికలోని నమోదుల నకళ్లను, అట్టి నమోదులు వేటికి సంబంధించినవో ఆ దస్తావేజులను నిష్పాదించు వ్యక్తులకు లేక వారి ఏజెంట్లకు మరియు నిష్పాదనకర్తలు మరణించిన తరువాత (కాని అంతకు ముందు కాదు); అట్టి నకళ్లకొరకై దరఖాస్తుచేయు ఎవరేని వ్యక్తికి ఈయవలెను.

కొన్ని పుస్తకములను మరియు అనుక్రమణికలను తనిఖీచేయుటకు రిజిస్ట్రీ అధికారులు అనుమతించవలసి యుండుట మరియు నమోదుల ధృవీకృత నకళ్లను ఈయవలసి యుండుట.

(3) అవే నిబంధనలకు లోబడి, పుస్తకము సంఖ్య 4లోని మరియు దానికి సంబంధించిన అనుక్రమణికలోని నమోదుల నకళ్లను, అట్టి నమోదులు నిర్దేశించు నట్టి ఆయా దస్తావేజులను నిష్పాదించు లేక వాటి క్రింద క్లెయిముచేయు ఎవరేని వ్యక్తికిగాని అతని ఏజెంటుకుగాని ప్రతినిధికిగాని ఈయవలెను.

(4) పుస్తకము సంఖ్య 3 మరియు 4 లోని నమోదులకొరకు ఈ పరిచ్ఛేదము క్రింద అపేక్షితమైన సోదాను రిజిస్ట్రీ అధికారి మాత్రమే చేయవలెను.

(5) ఈ పరిచ్ఛేదము క్రింద ఈయబడిన అన్ని నకళ్లకు రిజిస్ట్రీ అధికారిచే సంతకము చేయబడి ముద్ర వేయబడవలెను. మరియు అవి అసలు దస్తావేజులలోగల విషయములను రుజువుచేయు నిమిత్తము స్వీకారయోగ్యమై యుండును.

## టీ. రిజిస్ట్రీకొరకు స్వీకరించిన మీదట ప్రక్రియను గురించి.

*రిజిస్ట్రీకొరకు స్వీకరించిన దస్తావేజులపై పృష్ఠాంకనము చేయవలసిన వివరములు.*

58. (1) ఒక డిక్రీ లేక ఉత్తరువు యొక్క నకలుగాని 89వ పరిచ్ఛేదము క్రింద రిజిస్ట్రీ అధికారికి పంపబడిన నకలుగాని కానట్టిదై, రిజిస్ట్రీకొరకు స్వీకరించబడిన ప్రతియొక దస్తావేజుపై, ఈ క్రింది వివరములను ఆయా సమయములందు పృష్ఠాంకనము చేయవలెను, అవేవనగా:-

(ఏ) ఆ దస్తావేజును నిష్పాదించినట్లు ఒప్పుకొను ప్రతి వ్యక్తియొక్క సంతకము మరియు అతని అభివర్ణన; అట్టి నిష్పాదనను ఎవరేని వ్యక్తియొక్క ప్రతినిధి, హస్తాంతరణదారు లేక ఏజెంటు ఒప్పుకొనినచో అట్టి ప్రతినిధి, హస్తాంతరణదారు లేక ఏజెంటు యొక్క సంతకము మరియు అతని అభివర్ణన;

(బీ) ఈ చట్టము నందలి ఏవేని నిబంధనల క్రింద అట్టి దస్తావేజుకు సంబంధించి పరీక్షించబడిన ప్రతి వ్యక్తి యొక్క సంతకము మరియు అభివర్ణన;

(సీ) ఆ దస్తావేజు నిష్పాదనకు సంబంధించి, రిజిస్ట్రీ అధికారి సమక్షమున చేయబడిన ఏదేని డబ్బు చెల్లింపు లేక ఏవేని సరుకుల ఇచ్చివేత, మరియు అట్టి నిష్పాదనకు సంబంధించి ప్రతిఫలము పూర్తిగా గాని, అందు కొంత భాగముగాని ముట్టినదని అతని సమక్షమున చేసిన ఏదేని ఒప్పుకోలు.

(2) ఒక దస్తావేజును నిష్పాదించినట్లు ఒప్పుకొను ఎవరేని వ్యక్తి దానిపై పృష్ఠాంకనము చేయుటకు నిరాకరించినప్పటికిని, రిజిస్ట్రీ అధికారి దానిని రిజిస్టరు చేయవలెను కానీ అప్పుడే అట్టి నిరాకరణను గూర్చి ఒక టిప్పణి (నోటు)ని పృష్ఠాంకనముచేయవలెను.

*పృష్ఠాంకనములపై రిజిస్ట్రీఅధికారి తేదీవేసి సంతకముచేయవలసి యుండుట.*

59. రిజిస్ట్రీ అధికారి, అదే దస్తావేజుకు సంబంధించినట్టి అదే దినమున తన సమక్షమున 52వ మరియు 58వ పరిచ్ఛేదముల క్రింద చేయబడిన పృష్ఠాంకనములపై తేదీవేసి సంతకము చేయవలెను.

*రిజిస్ట్రీని గూర్చిన ధృవీకరణ.*

60. (1) 34వ, 35వ, 58వ మరియు 59వ పరిచ్ఛేదముల నిబంధనలలో రిజిస్ట్రీకొరకు సమర్పించబడిన ఏదేని దస్తావేజుకు వర్తించు నిబంధనలు పాటించబడిన పిమ్మట రిజిస్ట్రీ అధికారి దానిపై ఆ దస్తావేజు నకలు చేయబడిన పుస్తకము యొక్క సంఖ్య మరియు పుటతో సహా "రిజిస్టరు చేయబడినది" అను పదబంధముగల ఒక ధ్రువీకరణను పృష్ఠాంకనము చేయవలెను.

(2) అట్టి ధ్రువీకరణపై రిజిస్ట్రీ అధికారి సంతకముచేసి, ముద్రవేసి, తేదీ వేయవలెను అటుపై, ఆ దస్తావేజు ఈ చట్టము ద్వారా నిబంధించినట్లు తగురీతిగా రిజిస్టరు చేయబడినదని మరియు 59వ పరిచ్ఛేదములో నిర్దేశించిన పృష్ఠాంకనములలో తెలిపిన సంగతులు దానిలో తెలిపినట్లు జరిగినవని రుజువుచేయు నిమిత్తము స్వీకారయోగ్యమైనదగును.

*పృష్ఠాంకనములను ధృవీకరణలను నకలుచేసి దస్తావేజును వాపసు చేయవలెను.*

61. (1) అందుమీదట 59వ మరియు 60వ పరిచ్ఛేదములలో నిర్దేశించిన మరియు పేర్కొనిన పృష్ఠాంకనములను మరియు ధ్రువీకరణను రిజిస్టరు పుస్తకము మార్జిన్‌లో నకలుచేసి 21వ పరిచ్ఛేదములో పేర్కొనిన మ్యాపు లేక ప్లాను (ఏదైనా ఉన్నచో) దాని నకలును పుస్తకము సంఖ్య 1లో ఫైలుచేయవలెను.

(2) అందుమీదట ఆ దస్తావేజు రిజిస్ట్రీ పూర్తి అయినట్లు భావించవలెను మరియు అప్పుడు ఆ దస్తావేజును రిజిస్ట్రీకొరకు సమర్పించిన వ్యక్తిని గాని 52వ పరిచ్ఛేదములో పేర్కొనిన రసీదుపై అతడు అందుకై వ్రాతపూర్వకముగా నామ నిర్దేశముచేసినట్టి ఇతర వ్యక్తి (ఎవరైనా ఉన్నచో) అతనికిగాని వాపసు చేయవలెను.

రిజిస్ట్రీ అధికారికి తెలియని భాషలో ఉన్న దస్తావేజును సమర్పించిన మీదట ప్రక్రియ.

62. (1) 19వ పరిచ్ఛేదము క్రింద రిజిస్ట్రీ కొరకు ఒక దస్తావేజు సమర్పించబడినపుడు, అనువాదమును అసలు దస్తావేజుల రిజిస్టరులో వ్రాసుకొనవలెను, మరియు 19వ పరిచ్ఛేదములో నిర్దేశించిన నకలుతో సహా దానిని రిజిస్ట్రీకరణ కార్యాలయములో ఫైలుచేయవలెను.

(2) 59వ మరియు 60వ పరిచ్ఛేదములలో వరుసగా తెలిపిన పృష్ఠాంకనములను మరియు ధ్రువీకరణను అసలు దస్తావేజుపై చేయవలెను. మరియు 57వ, 64వ, 65వ మరియు 66వ పరిచ్ఛేదముల ద్వారా అపేక్షితమైన నకళ్లను జ్ఞాపనలను తయారు చేయు నిమిత్తము, ఆ అనువాదమును అసలు ప్రతి అయియుండిన ఎట్లో అట్లే ఎంచవలెను.

ప్రమాణములు చేయించుటకును కథనముల సారాంశమును వ్రాసియుంచుటకును అధికారము.

63. (1) ప్రతియొక రిజిస్ట్రీ అధికారి, ఈ చట్టపు నిబంధనల క్రింద తాను పరీక్షించిన ఏ వ్యక్తిచేనైనను తన వివేచనానుసారము, ప్రమాణము చేయించవచ్చును.

(2) అట్టి ప్రతి అధికారి తన వివేచనానుసారము, అట్టి ప్రతియొక వ్యక్తి చెప్పిన కథనము యొక్క సారాంశపు టిప్పణి (నోటును) కూడ వ్రాసియుంచవచ్చును, ఆ కథనమును అతనికి చదివి వినిపించవలెను, లేక (అది అట్టి వ్యక్తికి తెలియని భాషలో వ్రాయబడినచో) అతనికి తెలిసిన భాషలోకి అనువదించి చెప్పవలెను మరియు అట్టి టిప్పణి (నోటు) నిజమైనదని అతడు ఒప్పుకొనినచో, రిజిస్ట్రీ అధికారి దానిపై సంతకము చేయవలెను.

(3) అట్లు సంతకము చేయబడినట్టి ప్రతియొక టిప్పణి (నోటు) అందు వ్రాసియుంచబడిన కథనములు అందు తెలిపిన వ్యక్తులచేతను అందు తెలిపిన పరిస్థితుల లోను చెప్పబడినవని రుజువుచేయు నిమిత్తము స్వీకార యోగ్యమైనదగును.

## సీ. సబ్‌రిజిస్ట్రారు యొక్క ప్రత్యేక కర్తవ్యములు.

దస్తావేజు అనేక ఉపజిల్లాలలోని భూమికి సంబంధించినదైనయెడల ప్రక్రియ.

64. ప్రతి సబ్‌రిజిస్ట్రారు తన ఉపజిల్లాలో పూర్తిగా ఉండనట్టి స్థిరాస్తులకు సంబంధించినదియు మరణశాసనము కానట్టిదియు అయిన దస్తావేజును రిజిస్టరుచేసిన మీదట, దాని యొక్కయు దానిపైగల పృష్ఠాంకనము మరియు ధ్రువీకరణ (ఏదేని ఉన్నచో) దానియొక్కయు జ్ఞాపన తయారుచేసి దానిని, తాను ఎవరికి అధీనస్థుడై యున్నాడో అదే రిజిస్ట్రారుకు అధీనస్థుడైయున్నట్టి ఎవరి ఉపజిల్లాలో అట్టి ఆస్తి ఉన్నదో అట్టి ప్రతియొక ఇతర సబ్‌రిజిస్ట్రారుకు పంపవలెను మరియు అట్టి సబ్ రిజిస్ట్రారు ఆ జ్ఞాపనను తన పుస్తకము సంఖ్య 1లో ఫైలుచేయవలెను.

దస్తావేజు అనేక జిల్లాలలోని భూమిం సంబంధించినదైనయెడల ప్రక్రియ.

65. (1) ప్రతి సబ్‌రిజిస్ట్రారు ఒకటి కంటె ఎక్కువ జిల్లాలలో ఉన్నట్టి స్థిరాస్తికి సంబంధించినదియు మరణశాసనము కానట్టిదియు అయిన దస్తావేజును రిజిస్టరు చేసిన మీదట, దాని యొక్కయు దానిపై పృష్ఠాంకనము మరియు ధ్రువీకరణ (ఏదైనా ఉన్నచో) దాని నకలును 21వ పరిచ్ఛేదములో పేర్కొనిన మ్యాపు లేక ప్లాను (ఏదైనా ఉన్నచో) దాని నకలుతోసహా, తన ఉపజిల్లా ఉన్నట్టి జిల్లాకాక, అట్టి ఆస్తి యొక్క ఏదేని భాగము ఉన్నట్టి ప్రతి జిల్లా యొక్క రిజిస్ట్రారుకు కూడా పంపవలెను.

(2) రిజిస్ట్రారు అది తనకు అందినమీదట, ఆ దస్తావేజు నకలును, మరియు మ్యాపు లేక ప్లాను (ఏదైన ఉన్నచో) దాని నకలును తన పుస్తకము సంఖ్య 1లో

ఫైలుచేయవలెను మరియు ఆ దస్తావేజు జ్ఞాపనను తనకు అధీనస్థుడైయున్నట్టి ఎవరి ఉపజిల్లాలో అట్టి ఆస్తియొక్క ఏదేని భాగము ఉన్నదో అట్టి ప్రతి సబ్‌రిజిస్ట్రారుకు పంపవలెను; మరియు అట్టి జ్ఞాపన అందిన ప్రతి సబ్‌రిజిస్ట్రారు దానిని తన పుస్తకము సంఖ్య 1లో ఫైలుచేయవలెను

## డీ. _ రిజిస్ట్రారు ప్రత్యేక కర్తవ్యము.

భూమికి సంబంధించిన దస్తావేజులు రిజిస్టరు చేయబడిన తరువాత ప్రక్రియ.

66. (1) స్థిరాస్తికి సంబంధించినదియు మరణశాసనము కానట్టిదియు అయిన ఏదేని దస్తావేజును రిజిస్టరుచేసిన మీదట రిజిస్ట్రారు, అట్టి దస్తావేజు జ్ఞాపనను, తనకు అధీనస్థుడైయున్న ఎవరి ఉపజిల్లాలో ఆ ఆస్తియొక్క ఏదేని భాగము ఉన్నదో అట్టి ప్రతి సబ్‌రిజిస్ట్రారుకు పంపవలెను.

(2) రిజిస్ట్రారు, అట్టి దస్తావేజు నకలును 21వ పరిచ్ఛేదములో తెలిపిన మ్యాపు లేక ప్లాను (ఏదైనా ఉన్నచో) దాని నకలుతోసహా అట్టి ఆస్తియొక్క ఏదేని భాగము ఉన్నట్టి జిల్లాయొక్క ప్రతి ఇతర రిజిస్ట్రారుకు కూడ పంపవలెను.

(3) అట్టి రిజిస్ట్రారు అట్టి ఏదేని నకలు తనకు అందిన మీదట దానిని తన పుస్తకము సంఖ్య 1లో ఫైలుచేయవలెను మరియు ఆ నకలుయొక్క జ్ఞాపనను తనకు అధీనస్థుడైయున్నట్టి ఎవరి ఉపజిల్లాలో ఆ ఆస్తియొక్క ఏదేని భాగము ఉన్నదో అట్టి ప్రతియొక సబ్‌రిజిస్ట్రారుకు కూడ పంపవలెను.

(4) ఈ పరిచ్ఛేదము క్రింద ఏదేని జ్ఞాపన అందిన ప్రతియొక సబ్ రిజిస్ట్రారు దానిని తన పుస్తకము సంఖ్య 1లో ఫైలుచేయవలెను.

30వ పరిచ్ఛేదపు, ఉపపరిచ్ఛేదము (2) క్రింద రిజిస్ట్రారు చేయబడిన తరువాత ప్రక్రియ.

67. ఏదేని దస్తావేజు 30వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2) క్రింద రిజిస్టరు చేయబడిన మీదట, అట్టి దస్తావేజుయొక్కయు దానిపైగల పృష్ఠాంకనములు మరియు ధ్రువీకరణయొక్కయు నకలును, ఆ పత్రము దేనికి సంబంధించినదో ఆ ఆస్తియొక్క ఏదేని భాగము ఎవరి జిల్లాలో ఉన్నదో అట్టి ప్రతియొక రిజిస్ట్రారుకు పంపవలెను, అట్టి నకలు అందిన రిజిస్ట్రారు 66వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)లో అతని కొరకై విహితపరచబడిన ప్రక్రియను పాటించవలెను.

## ఈ. రిజిస్ట్రార్ల మరియు ఇన్‌స్పెక్టర్ జనరలుయొక్క నియంత్రణాధికారములను గురించి.

సబ్‌రిజిస్ట్రార్లను అధీక్షించుటకు మరియు నియంత్రించుటకు రిజిస్ట్రారు యొక్క అధికారము.

68. (1) ప్రతియొక సబ్‌రిజిస్ట్రారు తన పదవీ కర్తవ్యములను, అట్టి సబ్ రిజిస్ట్రారు కార్యాలయము ఎవరి జిల్లాలో ఉన్నదో ఆ రిజిస్ట్రారుయొక్క అధీక్షణ మరియు నియంత్రణలకు లోబడి నిర్వర్తించవలెను.

(2) ప్రతియొక రిజిస్ట్రారు తనకు అధీనస్థుడైన ఎవరేని సబ్‌రిజిస్ట్రారు చేసిన ఏదేని కార్యమును లేక కార్యలోపమును గురించి, లేక ఏదేని దస్తావేజు రిజిస్టరు చేయబడియున్నట్టి పుస్తకము లేక కార్యాలయము విషయములో ఏదేని తప్పును సరిదిద్దుట గురించి తాను ఆవశ్యకమని భావించి ఈ చట్టమునకు అనుగుణముగా ఉండు ఏదేని ఉత్తరువును (ఫిర్యాదుపై గాని అన్యథా గాని) జారీచేయుటకు ప్రాధికారము కలిగియుండును.

రిజిస్ట్రీకరణ కార్యాలయములను అధీక్షించుటకు మరియు నియమములను చేయుటకు ఇన్‌స్పెక్టర్ జనరలు యొక్క అధికారము.

69. (1) ఇన్‌స్పెక్టర్ జనరలు, రాజ్యప్రభుత్వము క్రింది రాజ్యక్షేత్రముల లోని రిజిస్ట్రీకరణ కార్యాలయములన్నింటిపై సాధారణ అధీక్షణ చేయవలెను మరియు అతనికి ఆయా సమయములందు–

(ఏ) పుస్తకముల, కాగితముల, మరియు దస్తావేజుల సురక్షితాభిరక్ష కొరకు ఏర్పాటుచేయుట,

(బీ) ప్రతిజిల్లాలో ఏయే భాషలు సాధారణముగా వాడబడుచున్నవని భావించవలెనో ప్రఖ్యానించుచు;

(సీ) 21వ పరిచ్ఛేదము క్రింద ఏ ప్రాదేశిక విభాగములను గుర్తించవలెనో ప్రఖ్యానించుచు;

(డీ) క్రమశ: 25వ మరియు 34వ పరిచ్ఛేదముల క్రింద విధించబడిన జుర్మానాల మొత్తమును క్రమబద్ధముచేయుచు;

(ఈ) 63వ పరిచ్ఛేదము ద్వారా రిజిస్ట్రి అధికారికి ఇవ్వబడిన వివేచనాధికార వినియోగమును క్రమబద్ధము చేయుచు;

(యఫ్) రిజిస్ట్రి అధికారులు దస్తావేజుల జ్ఞాపనలను ఏ ప్రరూపములో తయారు చేయవలెనో క్రమబద్ధము చేయుచు;

(జీ) రిజిస్ట్రార్లు మరియు సబ్‌రిజిస్ట్రార్లు 51వ పరిచ్ఛేదము క్రింద తమతమ కార్యాలయములలో ఉంచబడిన పుస్తకములను అధిప్రమాణీకరించుటను క్రమబద్ధము చేయుచు;

(జీజీ) 88వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2)లో నిర్దేశించిన పత్రములను రిజిస్ట్రికొరకు సమర్పించదగు రీతిని క్రమబద్ధము చేయుచు;

(హెచ్) క్రమశ: అనుక్రమణిక సంఖ్యలు 1,2,3 మరియు 4లలో ఉండవలసిన వివరములను ప్రఖ్యానించుచు;

(ఐ) రిజిస్ట్రికరణ కార్యాలయములలో పాటింపవలసిన సెలవు దినములను ప్రఖ్యానించుచు; మరియు

(జే) సాధారణముగా రిజిస్ట్రారు, మరియు సబ్‌రిజిస్ట్రారుల చర్యలను క్రమబద్ధము చేయుచు;

ఈ చట్టమునకు అనుగుణముగా నుండు నియమములను చేయుటకు అధికారము ఉండును.

(2) అట్లు చేయబడిన నియమములను ఆమోదముకొరకు రాజ్యప్రభుత్వమునకు సమర్పించవలెను: అవి ఆమోదింపబడిన పిమ్మట వాటిని రాజపత్రములో ప్రచురించవలెను; ప్రచురింపబడిన మీదట, అవి ఈ చట్టము క్రింద చేయబడియుండిన ఎట్లో అట్లే ప్రభావము కలిగియుండును.

70. ఇన్‌స్పెక్టర్ జనరలు తన వివేచనాధికారమును వినియోగించుచు, 25వ పరిచ్ఛేదము లేక 34వ పరిచ్ఛేదము క్రింద విధింపబడిన ఏదేని జుర్మానాకును మరియు సరియైన రిజిస్ట్రికరణ ఫీజు మొత్తమునకును మధ్యగల వ్యత్యాసమును పూర్తిగాగాని అందు కొంత భాగముగాని మాఫీ కూడ చేయవచ్చును.

జుర్మానాలను మాఫీచేయుటకు ఇన్‌స్పెక్టర్ జనరలుయొక్క అధికారము.

## భాగము 12.

## రిజిస్టరు చేయుటకు నిరాకరించుటను గురించి.

71. (1) ఒక దస్తావేజు దేనికి సంబంధించినదో ఆ ఆస్తి తన ఉపజిల్లాలో లేదను కారణముపై తప్ప, ఆ దస్తావేజును రిజిస్టరు చేయుటకు నిరాకరించు ప్రతియొక సబ్‌రిజిస్ట్రారు, నిరాకరణ ఉత్తరువుచేసి అట్టి ఉత్తరువు చేయుటకై తనకుగల కారణములను తన పుస్తకము సంఖ్య 2లో వ్రాసియుంచి "రిజిస్ట్రి నిరాకరించబడినది" అను పదబంధమును ఆ దస్తావేజుపై పృష్ఠాంకనము చేయవలెను;

రిజిస్టరు చేయుటకు నిరాకరించు కారణములను వ్రాసియుంచవలసియుండుట.

మరియు, ఆ దస్తావేజును నిష్పాదించు లేక దాని క్రింద క్లెయిముచేయు ఎవరేని వ్యక్తి దరఖాస్తుచేసిన మీదట చెల్లింపు లేకుండా మరియు అనావశ్యకమైన జాప్యము లేకుండ, అట్లు వ్రాసియుంచిన కారణముల ప్రతినొక దానిని అతనికి ఈయవలెను.

(2) అట్లు పృష్ఠాంకనము చెయబడిన దస్తావేజును రిజిస్టరు చేసికొనవలెనని ఇందు ఇటు పిమ్మటగల నిబంధనల క్రింద ఆదేశించబడిననే తప్ప, రిజిస్ట్రీ అధికారి ఎవరును ఆ దస్తావేజును రిజిస్ట్రీకొరకు స్వీకరించరాదు.

నిష్పాదించలేదనిన కారణముకాకుండ ఇతర కారణములపై రిజిస్టరు చేసికొనుటకు నిరాకరించుచు సబ్‌రిజిస్ట్రారు చేసిన ఉత్తరువుపై రిజిస్ట్రారుకు అపీలు.

72. (1) నిష్పాదించలేదనిన కారణముపై నిరాకరించినయెడల తప్ప, ఒక దస్తావేజును రిజిస్ట్రీ స్వీకరించుటకు నిరాకరించుచు సబ్‌రిజిస్ట్రారు చేసిన ఉత్తరువుపై (అట్టి దస్తావేజును రిజిస్టరుచేయుట తప్పని సరియైనదైనను అభిమతమునుబట్టి వీలున్నదైనను), అట్టి సబ్‌రిజిస్ట్రారు ఎవరికి అధీనస్థుడైయున్నాడో ఆ రిజిస్ట్రారుకు ఆ ఉత్తరువు తేదీనుండి ముప్పది దినముల లోపల సమర్పించబడినచో అట్టి రిజిస్ట్రారుకు అపీలు చేయదగి ఉండును; ఆ రిజిస్ట్రారు అట్టి ఉత్తరువును విపర్యస్తము చేయవచ్చును లేక మార్చవచ్చును.

(2) ఆ దస్తావేజును రిజిస్టరు చేసికొనవలెనని రిజిస్ట్రారుయొక్క ఉత్తరువులో ఆదేశించబడియుండి, అట్టి ఉత్తరువు చేయబడిన పిమ్మట ముప్పది దినముల లోపల రిజిస్ట్రీకొరకు ఆ దస్తావేజు తగురీతిగా సమర్పించబడినచో సబ్‌రిజిస్ట్రారు దానిని పాటించవలెను; అందుమీదట ఆచరణ సాధ్యమైనంతమేరకు, 58వ, 59వ మరియు 60వ పరిచ్ఛేదములలో విహితపరచబడిన ప్రక్రియను అనుసరించవలెను మరియు ఆ దస్తావేజు రిజిస్ట్రీకొరకు మొట్టమొదట తగురీతిగా సమర్పించబడినపుడే రిజిస్టరు చేయబడియుండిన ఎట్లో అట్లు అట్టి రిజిస్ట్రీకరణ ప్రభావము కలిగియుండును.

నిష్పాదించలేదనిన కారణములపై రిజిస్టరు చేయుటకు సబ్‌రిజిస్ట్రారు నిరాకరించినయెడల రిజిస్ట్రారుకు దరఖాస్తు.

73. (1) ఏదేని దస్తావేజును అది ఎవరిచే నిష్పాదించబడినట్లు తాత్పర్యమగుచున్నదో ఆ వ్యక్తిగాని అతని ప్రతినిధిగాని హస్తాంతరణదారుగాని అది నిష్పాదించబడలేదనిన కారణముపై రిజిస్టరు చేయుటకు సబ్‌రిజిస్ట్రారు నిరాకరించినప్పుడు, అట్టి దస్తావేజు క్రింద క్లెయిముచేయు ఎవరేని వ్యక్తి లేక అతని ప్రతినిధి, హస్తాంతరణ దారు లేక పైన చెప్పబడినట్లు ప్రాధికారమీయబడిన ఏజెంటు ఆ దస్తావేజును రిజిస్టరు చేయించుకొనుటకు తనకు గల హక్కును నిరూపించుకొనుటకై అట్టి నిరాకరణ ఉత్తరువు చేయబడిన పిమ్మట ముప్పది దినముల లోపల, అట్టి సబ్‌రిజిస్ట్రారు ఎవరికి అధీనస్థుడైయున్నాడో ఆ రిజిస్ట్రారుకు దరఖాస్తు చేయవచ్చును.

(2) అట్టి దరఖాస్తు వ్రాతపూర్వకముగా ఉండవలెను; 71వ పరిచ్ఛేదము క్రింద వ్రాసియుంచబడిన కారణముల ప్రతిని దానికి జతచేయవలెను; దరఖాస్తుదారు ఆ దరఖాస్తులోని కథనములను దావాపత్రముల సత్యాపనకొరకు శాసనము ద్వారా అపేక్షితమైన రీతిగానే సత్యాపనము చేయవలెను.

అట్టి దరఖాస్తుపై రిజిస్ట్రారుయొక్క ప్రక్రియ.

74. అట్టి సందర్భములోను, మరియు రిజిస్ట్రారు సమక్షమున అతనికి రిజిస్ట్రీకొరకు సమర్పించబడిన దస్తావేజు పైన చెప్పబడినట్లు నిష్పాదించబడలేదనిన యెడల రిజిస్ట్రారు, వీలైనంత శీఘ్రముగా–

(ఏ) ఆ దస్తావేజు నిష్పాదించబడినదా;

(బీ) ఆ దస్తావేజుకు రిజిస్ట్రీహక్కును కలుగచేయుటకుగాను, తత్సమయమున అమలునందున్న శాసనములో అపేక్షితమైన వాటిని దరఖాస్తుదారు లేక సందర్భానుసారముగ, ఆ దస్తావేజును రిజిస్ట్రీ కొరకు సమర్పించు వ్యక్తి పాటించినాడా;

అనునది పరిశీలించవలెను.

రిజిస్టరు చేయుటకు రిజిస్ట్రారుచే ఉత్తరువు మరియు అందుమీదట ప్రక్రియ.

75. (1) ఆ దస్తావేజు నిష్పాదించబడినదనియు సదరు అపేక్షితములు పాటించబడినవనియు రిజిస్ట్రారు నిశ్చయించినచో, అతడు ఆ దస్తావేజును రిజిస్టరు చేయవలెనని ఉత్తరువు చేయవచ్చును.

(2) ఆ దస్తావేజు అట్టి ఉత్తరువు చేయబడిన పిమ్మట ముప్పది దినముల లోపల రిజిస్ట్రీకొరకు తగురీతిగా సమర్పించబడినచో, రిజిస్ట్రీ అధికారి దానిని పాటించవలెను; అందుమీదట, ఆచరణ సాధ్యమైనంతమేరకు 58వ, 59వ మరియు 60వ పరిచ్ఛేదములలో విహితపరచబడిన ప్రక్రియను అనుసరించవలెను.

(3) అట్టి రిజిస్ట్రీకరణ, అది మొట్టమొదట రిజిస్ట్రీకొరకు తగురీతిగా సమర్పించబడినప్పుడు రిజిస్టరు చేయబడియుండిన ఎట్లో అట్లే ప్రభావము కలిగియుండును.

(4) రిజిస్ట్రారు 74వ పరిచ్ఛేదము క్రింద ఏదేని పరిశీలన జరుపు నిమిత్తము తాను ఒక సివిలు న్యాయస్థానము అయియుండిన ఎట్లో అట్లే సాక్షులను సమనుచేసి వారు హాజరగునట్లు చేయవచ్చును, మరియు సాక్ష్యమునిచ్చుటకు వారిని బలవంత పెట్టవచ్చును; ఏదేని అట్టి పరిశీలన యొక్క ఖర్చులు పూర్తిగాగాని, కొంత భాగముగా గాని ఎవరిచే చెల్లింపబడవలెనో కూడ అతడు ఆదేశించవచ్చును; అట్టి ఖర్చులు సివిలు ప్రక్రియా స్మృతి 1908 క్రింద ఒక దావాలో ఇప్పించబడియుండిన ఎట్లో అట్లే వసూలు చేయబడదగియుండును.

1908 లోని 5వ చట్టము.

రిజిస్ట్రారుచే నిరాకరణ ఉత్తరువు.

76. (1) (ఏ) ఏదేని దస్తావేజు ఏ ఆస్తికి సంబంధించినదో ఆ ఆస్తి తన జిల్లాలో లేదను, లేక ఆ దస్తావేజు ఒక సబ్‌రిజిస్ట్రారు కార్యాలయములో రిజిస్టరు చేయబడవలసినదను కారణముపై తప్ప, ఆ దస్తావేజును రిజిస్టరు చేయుటకు, లేక

(బీ) 72వ పరిచ్ఛేదము లేక 75వ పరిచ్ఛేదము క్రింద దస్తావేజును రిజిస్టరు చేయవలసినదని ఆదేశించుటకు,

నిరాకరించు ప్రతియొక రిజిస్ట్రారు, నిరాకరణ ఉత్తరువుచేసి అట్టి ఉత్తరువుకుగల కారణములను తన పుస్తకము సంఖ్య 2లో వ్రాసియుంచవలెను మరియు ఆ దస్తావేజును నిష్పాదించు లేక దాని క్రింద క్లెయిముచేయు ఎవరేని వ్యక్తి దరఖాస్తు చేసిన మీదట అనావశ్యకమైన జాప్యము లేకుండ, అట్లు వ్రాసియుంచిన కారణముల ప్రతినొకదానిని అతనికి ఈయవలెను.

(2) ఈ పరిచ్ఛేదము క్రిందగాని 72వ పరిచ్ఛేదము క్రిందగాని రిజిస్ట్రారుచే చేయబడిన ఏదేని ఉత్తరువుపై అపీలు ఏదియు ఉండదు.

రిజిస్ట్రారుచే నిరాకరణ ఉత్తరువు చేయబడిన సందర్భములో దావా.

77. (1) 72వ పరిచ్ఛేదము క్రిందగాని 76వ పరిచ్ఛేదము క్రింద గాని దస్తావేజును రిజిస్టరు చేసికొనవలెనని ఉత్తరువుచేయుటకు రిజిస్ట్రారు నిరాకరించినయెడల ఆ దస్తావేజు క్రింద క్లెయిముచేయు ఎవరేని వ్యక్తి లేక అతని ప్రతినిధి, హస్తాంతరణదారు, లేక ఏజెంటు, నిరాకరణ ఉత్తరువు చేయబడిన పిమ్మట ముప్పది దినముల లోపల, ఆ దస్తావేజును రిజిస్టరు చేసికొనవలెనని కోరబడిన కార్యాలయము దేని ఆరంభిక అధికారిత యొక్క స్థానిక హద్దులలో ఉన్నదో ఆ సివిలు న్యాయస్థానములో డిక్రీ ఈయబడిన ముప్పది దినముల లోపల ఆ దస్తావేజు రిజిస్ట్రీకొరకు తగురీతిగా సమర్పించబడినచో అట్టి కార్యాలయములో దానిని రిజిస్టరు చేసికొనవలెనని ఆదేశించు డిక్రీకొరకు దావా వేయవచ్చును.

(2) 75వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదములు (2) మరియు (3)ల లోని నిబంధనలు అట్టి ఏదేని డిక్రీ ననుసరించి రిజిస్ట్రీకొరకు సమర్పించబడిన దస్తావేజు

లన్నింటికి అవశ్యకమ్మైనట్టి మార్పులతో వర్తించును మరియు ఈ చట్టములో ఏమి యున్నప్పటికినీ ఆ దస్తావేజు అట్టి దావాలో సాక్ష్యములో తీసికొనదగినదై యుండును.

భాగము 13.

## రిజిస్ట్రీకొరకు, నోదాలకు మరియు నకళ్లకొరకు ఫీజులను గురించి.

ఫీజులను రాజ్య ప్రభుత్వము నియతము చేయవలసి యుండుట.

78. రాజ్యప్రభుత్వము—

(ఏ) దస్తావేజుల రిజిస్ట్రీకొరకు;

(బీ) రిజిస్టర్ల నోదాకొరకు;

(సీ) రిజిస్ట్రీ చేయుటకు ముందుగాని రిజిస్టరు చేసిన మీదటగాని లేక ఆ తరువాతగాని కారణముల లేక నమోదుల లేక దస్తావేజుల నకళ్లను తయారుచేయుట కొరకు, లేక ఇచ్చుట కొరకు చెల్లించవలసిన ఫీజుల యొక్కయు; మరియు

(డీ) 30వ పరిచ్ఛేదము క్రింది ప్రతియొక రిజిస్ట్రీకొరకు;

(ఈ) కమిషన్లను పంపుటకొరకు;

(యఫ్) అనువాదములను దాఖలుచేయుట కొరకు;

(జీ) ప్రైవేటు నివాసముల వద్ద హాజరగుట కొరకు;

(హెచ్) దస్తావేజుల సురక్షితాభిరక్ష కొరకు మరియు వాటి వాపసుకొరకు, మరియు;

(ఐ) ఈ చట్ట ప్రయోజనములను అమలుపరచుటకు రాజ్యప్రభుత్వమునకు అవశ్యకమ్మైనదిగా తోచునట్టి ఇతర విషయముల కొరకు చెల్లించవలసిన అతిరిక్త లేక అదనపు ఫీజులయొక్కయు;

పట్టికను తయారుచేయవలెను.

ఫీజుల ప్రచురణ.

79. అట్లు చెల్లించపదగిన ఫీజు పట్టికను రాజపత్రములో ప్రచురించవలెను మరియు దాని ప్రతినొక దానిని ఆంగ్లములోను మరియు జిల్లాలోని దేశీయ భాషలోను అందరికి తెలియునట్లు ప్రతి రిజిస్ట్రీకరణ కార్యాలయములో ప్రదర్శించవలెను.

దస్తావేజును సమర్పించిన మీదట చెల్లింపవలసిన ఫీజు.

80. ఈ చట్టము క్రింద దస్తావేజుల రిజిస్ట్రీకొరకైన ఫీజులన్నియు అట్టి దస్తావేజులను సమర్పించిన మీదట చెల్లింపదగినవై యుండును.

భాగము 14.

## శాస్తులను గురించి.

హానికలిగించు ఉద్దేశముతో దస్తావేజులను తప్పుగా పృష్ఠాంకనము, నకలు అనువాదము లేక రిజిస్టరు చేసినందులకు శాస్తి. 1860 లోని 45వ చట్టము.

81. ఈ చట్టపు నిబంధనల క్రింద సమర్పించబడిన లేక డిపాజిటు చేయబడిన ఏదేని దస్తావేజును పృష్ఠాంకనము, నకలు, అనువాదము లేక రిజిస్టరుచేయు బాధ్యత అప్పగించబడియుండి సరియైనదికాదని తాను ఎరిగియున్నట్టి లేక విశ్వసించుచున్నట్టి రీతిలో అట్టి దస్తావేజును పృష్ఠాంకనము, నకలు, అనువాదము లేక రిజిస్టరు చేయుట ద్వారా ఏ వ్యక్తికైనను భారత శిక్షాస్మృతిలో నిర్వచింపబడినట్లు హానికలిగించు ఉద్దేశముతో లేక అట్లు హానికలిగించగలనని ఎరిగియుండియు అట్లు చేయునట్టి, ఈ చట్టము క్రింద నియమింపబడిన ప్రతియొక రిజిస్ట్రీ అధికారి మరియు ఈ చట్ట

ప్రయోజనముల కొరకు అతని కార్యాలయములో నియోగించబడిన ప్రతియొక వ్యక్తి ఏడు సంవత్సరముల దాక ఉండగల కాలావధికి కారావాసముతో గాని జుర్మానాతో గాని లేక ఈ రెండింటితో గాని శిక్షింపబడును.

అబద్ధాలు చెప్పినందుకు, తప్పుడు నకళ్ళు లేక అనువాదములు ఇచ్చినందుకు, తప్పుడు ప్రతిరూపణము చేసినందుకు లేక దుష్ప్రేరణ చేసినందుకు శాస్తి.

82. (ఏ) ఈ చట్టమును అమలుపరచుచు వ్యవహరించుచున్న ఎవరేని అధికారి సమక్షమున, ఈ చట్టము క్రింది ఏదేని చర్యలో లేక పరిశీలనలో, ప్రమాణము చేసిగాని చేయకుండగాని వ్రాసియుంచబడినను, లేకున్నను ఉద్దేశపూర్వకముగా ఏదేని అబద్ధము చెప్పువారెవరైనను; లేక

(బీ) 19వ పరిచ్ఛేదము లేక 21వ పరిచ్ఛేదము క్రింద ఏదేని చర్యలో ఏదేని దస్తావేజు యొక్క తప్పుడు నకలునుగాని అనువాదమునుగాని, ఒక తప్పుడు మ్యాపు లేక ప్లాను ప్రతినిగాని రిజిస్ట్రి అధికారికి ఉద్దేశపూర్వకముగా అందజేయువారెవరైనను; లేక

(సీ) మరొకరిగ తప్పుడు ప్రతిరూపణముచేసి అట్లు ఆపాదించుకున్న రూపములో, ఈ చట్టము క్రింది ఏదేని చర్యలో లేక పరిశీలనలో ఏదేని దస్తావేజును సమర్పించు లేక దేనినైనను ఒప్పుకొను లేక చెప్పు లేక ఏదేని సమను జారీచేయించు లేక కమీషను పంపబడునట్లుచేయు లేక ఏదేని ఇతర కార్యమును చేయువారెవరైనను; లేక

(డీ) ఈ చట్టము క్రింద శిక్షింపదగినదిగా చేయబడిన దేనికైనను దుష్ప్రేరణ చేయు వారెవరైనను;

ఏడు సంవత్సరముల దాక ఉండగల కాలావధికి కారావాసముతోగాని, జుర్మానాతోగాని లేక, ఈ రెండింటితోగాని శిక్షింపబడుదురు.

రిజిస్ట్రి అధికారి అభియోగమును ప్రారంభించవచ్చును.

83. (1) రిజిస్ట్రి అధికారికి తన అధికార హోదాలో తెలియవచ్చినట్టి ఈ చట్టము క్రింది ఏదేని అపరాధమునకై అభియోగము, ఆ అపరాధము, సందర్భానుసారముగ, ఎవరి అధికార క్షేత్రములలో, జిల్లాలో లేక ఉపజిల్లాలో చేయబడినదో ఆ ఇన్స్పెక్టర్ జనరలుచే గాని రిజిస్ట్రారుచేగాని లేక సబ్‌రిజిస్ట్రారుచేగాని లేక అతని అనుజ్ఞతోగాని ప్రారంభించబడవచ్చును.

(2) ఈ చట్టము క్రింద శిక్షార్హమైన అపరాధములు, రెండవ తరగతి మేజిస్ట్రేటుకుగల అధికారముల కంటె తక్కువకాని అధికారములను వినియోగించెడి ఏదేని న్యాయస్థానముచే, లేక ఎవరేని అధికారిచే విచారణ చేయదగినవైయుండును.

రిజిస్ట్రి అధికారులను పబ్లిక్‌ సేవకులుగా భావించవలసి యుండుట. (1860 లోని 45వ చట్టము.

84. (1) ఈ చట్టము క్రింద నియమింపబడిన ప్రతియొక రిజిస్ట్రి అధికారిని భారత శిక్షాస్మృతిలోని భావపరిధిలో పబ్లిక్‌ సేవకుడుగా భావించవలెను.

(2) అట్టి రిజిస్ట్రి అధికారి సమాచారము అందించవలసినదిగా కోరినప్పుడు ప్రతి వ్యక్తి అట్టి సమాచారమును ఆ అధికారికి అందించుటకు శాసనరీత్యా బద్ధుడై యుండును.

(3) భారత శిక్షాస్మృతి యొక్క 228వ పరిచ్ఛేదములోని "న్యాయిక చర్య" అను పదబంధపరిధిలో ఈ చట్టము క్రింది ఏ చర్యయైనను చేరియున్నట్లు భావించవలెను.

## భాగము 15.

## వివిధ విషయములు.

క్లెయిము చేయబడని దస్తావేజులను నాశముచేయుట.

85. ఏదేని రిజిస్ట్రీకరణ కార్యాలయములో రెండు సంవత్సరములకు పైబడి క్లెయిము చేయబడకయున్న (వీలునామాలుకానట్టి) దస్తావేజులను నాశముచేయవచ్చును.

రిజిస్ట్రీఅధికారి తన అధికార హోదాలో సద్భావముతో చేసిన దానికి లేక నిరాకరించినదానికి బాధ్యుడు కాకుండుట.

86. రిజిస్ట్రీ అధికారి ఎవరును, అతని అధికార హోదాలో సద్భావముతో చేసిన లేక నిరాకరించిన దేని కారణమునగాని ఏదేని దావా, క్లెయిము లేక అభ్యర్థనకు గురిచేయబడరాదు.

అట్లు చేయబడినది ఏదియు నియామకములో, లేక ప్రక్రియలో లోపము వలన శాసనమాన్యత లేనిదికాదు.

87. ఎవరేని రిజిస్ట్రీ అధికారి ఈ చట్టము ననుసరించిగాని, ఇందుమూలముగా రద్దు చేయబడిన ఏదేని చట్టము ననుసరించిగాని సద్భావముతో చేసినదేదియు, అతని నియామకములో లేక ప్రక్రియలో ఏదేని లోపము ఉన్నదను కారణ మాత్రముననే శాసనమాన్యత లేనిదిగా భావించబడరాదు.

ప్రభుత్వాధికారులు లేక కొందరు పట్టీకు కృత్యకారులు నిష్పాదించిన దస్తావేజుల రిజిస్ట్రీకరణ.

88. (1) ఈ చట్టములో ఏమియున్నప్పటికినీ—

(ఏ) ఎవరేని ప్రభుత్వాధికారి, లేక

(బీ) ఎవరేని అడ్మినిస్ట్రేటరు జనరలు, అధికారిక ట్రస్టీ, లేక అధికారిక అస్సైనీ, లేక

(సీ) షెరీఫ్, రిసీవరు, లేక ఉన్నత న్యాయస్థానపు రిజిస్ట్రారు, లేక

(డీ) రాజ్యప్రభుత్వము రాజపత్రములో ఈ విషయమున జారీచేసిన అధిసూచనలో నిర్దిష్టపరచబడినట్టి ఇతర పట్టీకు పదవియందు తత్సమయమున ఉన్న వ్యక్తి,

తన ఆధికారిక హోదానుబట్టి తనచే లేక తన పేర నిష్పాదించబడిన ఏదేని పత్రము యొక్క రిజిస్ట్రీకి సంబంధించిన ఏ చర్యలోనైనను ఏదేని రిజిస్ట్రీకరణ కార్యాలయములో స్వయముగాగాని ఏజెంటు ద్వారాగాని హాజరగుట లేక 58వ పరిచ్ఛేదములో నిబంధించబడినట్లు సంతకము చేయుట ఆవశ్యకముకాదు.

(2) ప్రభుత్వాధికారిచే లేక అతని పేర లేక ఉపపరిచ్ఛేదము (1)లో నిర్దేశించిన ఎవరేని ఇతర వ్యక్తిచే లేక అతని పేర నిష్పాదించబడిన ఏదేని దస్తావేజును రిజిస్ట్రీ కొరకు, 69వ పరిచ్ఛేదము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచబడిన రీతిగా సమర్పించవచ్చును.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద రిజిస్ట్రీకొరకు ఏదేని పత్రము సమర్పించబడిన రిజిస్ట్రీ అధికారి, దానిని గురించిన సమాచారము కొరకు తాను సబబని భావించినచో, ఎవరేని ప్రభుత్వ కార్యదర్శికి లేక ఉపపరిచ్ఛేదము (1)లో నిర్దేశించబడినట్టి ప్రభుత్వాధికారికి లేక ఇతర వ్యక్తికి నిర్దేశించవచ్చును, మరియు దాని నిష్పాదనను గురించి తృప్తిచెందిన పిమ్మట ఆ పత్రమును రిజిస్టరు చేసికొనవలెను.

కొన్ని ఉత్తరువులు, ధ్రువపత్రములు, మరియు పత్రముల ప్రతులను రిజిస్ట్రీ అధికారులకు పంపుట మరియు ఫైలుచేయుట.

89. (1) భూమి అభివృద్ధి అప్పుల చట్టము, 1883 (1883 లోని 19వ చట్టము) క్రింద అప్పు మంజూరుచేయు ప్రతిఅధికారి తాను చేసిన ఉత్తరువు ప్రతినొక దానిని అభివృద్ధిచేయబడవలసిన భూమి లేక అదనపు ప్రతిభూతిగా ఈయబడవలసిన భూమి పూర్తిగాగాని అందలి ఏదేని భాగముగాని ఎవరి అధికారితాపరిధి స్థానిక హద్దులలో ఉన్నదో ఆ రిజిస్ట్రీ అధికారికి పంపవలెను అట్టి రిజిస్ట్రీ అధికారి ఆ ప్రతిని తన పుస్తకము సంఖ్య 1లో ఫైలు చేసుకొనవలెను.

1908లోని 5వ చట్టము.

(2) సివిలు ప్రక్రియా స్మృతి 1908 క్రింద స్థిరాస్తి, విక్రయధ్రువపత్రము నిచ్చు ప్రతి న్యాయస్థానము అట్టి ధ్రువపత్రపు ప్రతినొకదానిని ధ్రువపత్రములోని స్థిరాస్తి పూర్తిగాగాని అందలి ఏదేని భాగముగాని ఎవరి అధికారితాపరిధి స్థానిక హద్దులలో ఉన్నదో ఆ రిజిస్ట్రీ అధికారికి పంపవలెను అట్టి అధికారి ఆ ప్రతిని తన పుస్తకము సంఖ్య 1లో ఫైలుచేసికొనవలెను.

(3) వ్యవసాయదారుల అప్పుల చట్టము, 1884 క్రింద అప్పు మంజూరు చేయు ప్రతి అధికారి, ఆ అప్పు తిరిగి చెల్లింపునకై ప్రతిభూతి కల్పించు నిమిత్తము స్థిరాస్తిని తాకట్టు పెట్టినట్టి ఏదేని పత్రము యొక్క ప్రతినొక దానిని మరియు ఆ అప్పు మంజూరుచేయు ఉత్తరువులోనే అట్టి ఆస్తి తన్నిమిత్తము తాకట్టు పెట్టబడినచో, ఆ ఉత్తరువు ప్రతినొక దానిని కూడా అట్లు తాకట్టు పెట్టబడినట్టి ఆస్తి పూర్తిగా గాని లేక అందలి ఏదేని భాగముగాని ఎవరి అధికారితా పరిధి స్థానిక హద్దులలో ఉన్నదో, ఆ రిజిస్ట్రి అధికారికి పంపవలెను అట్టి రిజిస్ట్రి అధికారి, ఆ ప్రతిని లేక సందర్భాను సారముగా ప్రతులను తన పుస్తకము సంఖ్య 1లో ఫైలు చేసికొనవలెను.

1884లోని 12వ చట్టము.

(4) బహిరంగ వేలము ద్వారా విక్రయించబడిన స్థిరాస్తి కొనుగోలుదారుకు విక్రయ ధ్రువపత్రమునిచ్చు ప్రతి రెవెన్యూ అధికారి, అట్టి ధ్రువపత్రము ప్రతినొక దానిని ఆ ధ్రువపత్రములోని ఆస్తి పూర్తిగాగాని అందలి ఏదేని భాగముగాని ఎవరి అధికారితా పరిధి స్థానిక హద్దులలో ఉన్నదో ఆ రిజిస్ట్రి అధికారికి పంపవలెను అట్టి అధికారి ఆ ప్రతిని తన పుస్తకము సంఖ్య 1లో ఫైలుచేసికొనవలెను.

## <u>చట్టము నుండి మినహాయింపులు.</u>

90. (1) ఈ చట్టములో బారత రిజిస్ట్రికరణ చట్టము, 1877 (1877లోని 3వ చట్టము)లో లేక భారత రిజిస్ట్రికరణ చట్టము, 1871 (1871లోని 8వ చట్టము)లో లేక వాటి ద్వారా రద్దుచేయబడిన ఏదేని చట్టములో ఉన్నదేదియు, ఈ క్రింది దస్తావేజులలో లేక మ్యాపులలో దేనినిగాని రిజిస్టరు చేయవలెనని కోరునదిగా లేక ఎప్పుడైనను కోరినట్లు భావింపబడరాదు, అవేవనగా:-

ప్రభుత్వముచే లేక దాని పేర నిష్పాదించబడిన కొన్ని దస్తావేజుల మినహాయింపు.

(ఏ) భూమి శిస్తును సెటిల్మెంటు చేయుటలోగాని అట్టి సెటిల్మెంటును పునరీక్షణ చేయుటలోగాని నియుక్తుడైన ఎవరేని అధికారిచే జారీచేయబడి, పుచ్చుకొనబడి లేక అనుప్రమాణీకరించబడి అట్టి సెటిల్మెంటు రికార్డులలో భాగముగానున్న దస్తావేజులు; లేక

(బీ) ఏదేని భూమిని సర్వే చేయుటలోగాని అట్టి సర్వేను పునరీక్షణ చేయుటలోగాని ప్రభుత్వము తరఫున నియుక్తుడైన ఎవరేని అధికారిచే జారీచేయబడి, పుచ్చుకొనబడి లేక అనుప్రమాణీకరింపబడి అట్టి సర్వే రికార్డులో భాగముగానున్న దస్తావేజులు; లేక

(సీ) తత్సమయమున అమలులోనున్నట్టి ఏదేని శాసనము క్రింద, గ్రామపు రికార్డులు తయారుచేయు బాధ్యత అప్పగించబడినట్టి పట్వారీచేగాని ఇతర అధికారులచే గాని ఏదేని రెవిన్యూ కార్యాలయములో నియతకాలకముగా ఫైలు చేయబడు దస్తావేజులు; లేక

(డీ) భూమినిగాని భూమిలోని ఏదేని హితమునుగాని ప్రభుత్వము అనుదానము లేక హస్తాంతరణము చేసినట్లు లేక అట్టి అనుదానములకు హస్తాంతరణములకు సాక్షీభూతముగా నున్నట్లు తాత్పర్యమగు సనదులు, ఇనాములు, హక్కుమూల పత్రములు మరియు ఇతర దస్తావేజులు; లేక

(ఈ) బొంబాయి ల్యాండు రెవిన్యూ కోడు, 1879 యొక్క 74వ పరిచ్ఛేదము లేక 76వ పరిచ్ఛేదము క్రింద, జిరాయతీ హక్కును త్యజించుటను గూర్చి ఆక్రమణదారులు, లేక అన్యాక్రాంత భూమిని త్యజించుటను గూర్చి అట్టి భూధారకులు ఇచ్చిన నోటీసులు.

1879 లోని 5వ బొంబాయి చట్టము.

(2) అట్టి దస్తావేజులు, మరియు మ్యాపులన్నియు 48వ మరియు 49వ పరిచ్ఛేదముల ప్రయోజనముల కొరకు ఈ చట్టపు నిబంధనల ననుసరించి రిజిస్టరు చేయబడియుండినవిగా లేక రిజిస్టరు చేయబడవలసినవిగా భావింపబడవలెను.

అట్టి దస్తావేజుల తనిఖీ మరియు వాటి నకళ్ళు

91. (1) ఈ విషయములో రాజ్యప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా విహితము చేయునట్టి నియమములకును అట్టి ఫీజు ముందుగా చెల్లించబడుటకును లోబడి, 90వ పరిచ్ఛేదములోని, ఖండములు (ఏ), (బీ), (సీ) మరియు (ఈ)లలో పేర్కొనిన దస్తావేజులను, మరియు మ్యాపులన్నింటిని మరియు ఖండము (డీ)లో పేర్కొనిన దస్తావేజుల రిజిస్టర్లన్నింటిని తనిఖీచేయుటకు దరఖాస్తుచేయు ఎవరేని వ్యక్తికి వాటిని తనిఖీకై అందుబాటులో ఉంచవలెను మరియు పైన చెప్పినదానికి లోబడి, అట్టి దస్తావేజుల నకళ్లకొరకు దరఖాస్తుచేయు వ్యక్తులందరికి అట్టి నకళ్లను ఈయవలెను.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద విహితము చేయబడిన లేక 69వ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ప్రతియొక నియమము, అది చేయబడిన పిమ్మట వీలైనంత శీఘ్రముగా రాజ్యశాసనమండలి సమక్షమున ఉంచబడవలెను.

92. x x x x x x x x

<u>రద్దులు.</u>

1938 లోని 1వ చట్టము.

93. రద్దుచేయు చట్టము, 1938 యొక్క 2వ పరిచ్ఛేదము మరియు అనుసూచి ద్వారా రద్దు చేయబడినది.

<u>అనుసూచి</u>:- (అధిశాసనముల రద్దు) పై చట్టముయొక్క 2వ పరిచ్ఛేదము మరియు అనుసూచి ద్వారా రద్దు చేయబడినది;